RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 25 ఆగస్ట్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ. 2.00 | సంపుటి:22 | సంచిక:75

# ప్రధాని ఇంకా గుజరాతీగానే వ్యవహరిస్తున్నారు

## ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం రేవంత్ రెడ్డి






సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం. ఇది భారత దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి

విద్య, క్రీడలు, పెట్టుబడులు లక్ష్యంగా మా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నాం

తెలంగాణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక కార్యాచరణ తీసుకుని ముందుకెళుతోంది

విదేశీ పర్యటనకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖకు పూర్తి సమాచారం అందించాం

విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇంగ్లాండ్ కు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించింది

ఈ విషయంలో కేంద్రం వైఖరిని అందరూ తప్పు పట్టారు

నా పర్యటనను తిరస్కరించడమే కాకుండా బీజేపీ నాయకులు రాజకీయంగా నాపై వ్యక్తిగత ఆరోపణలు చేశారు

బీజేపీ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేశారు

బీజేపీ వైఖరిపై రాజకీయ అంశాలను నేను ప్రస్తావించదలచుకోలేదు.

ఇది రెండు ప్రభుత్వాలకు సంబంధించిన అంశం

అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సమర్పించాం

రాజకీయపరమైన నిర్ణయాలతో పర్యటనను తిరస్కరిస్తున్నామని చెప్పారు

ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి

ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనకు గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతించారు

వైబ్రంట్ గుజరాత్ అని పెట్టుబడుల కోసం గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చారు

కానీ తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా అమెరికాలో పర్యటించాలనుకుంటే అడ్డుకున్నారు

నిజంగా నా విదేశీ పర్యటనలో విషయం లేదనుకుంటే ఇంగ్లాండ్ కు ఎందుకు అనుమతి ఇచ్చారు? అమెరికాకు ఎందుకు తిరస్కరించారు?

మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఇంగ్లాండ్ లో చదువుకుని దేశానికి దార్శనికులుగా మారారు

ఆర్థికంగా వెనకబడిన వారు విదేశాల్లో చదువుకునే పరిస్థితి ఉండదు

విదేశీ చదువులను, క్రీడలను ఇక్కడికి తీసుకురావాలని మేం ప్రయత్నిస్తున్నాం

ఇందుకు విదేశీ పర్యటనలు ఉపయోగపడుతాయని భావించాం

ప్రధాని ఇంకా గుజరాతీగానే వ్యవహరిస్తున్నారు తప్ప భారత ప్రధానిగా వ్యవహరించడం లేదు

ఇది రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా జరిగిన అవమానం కాదు

ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం

దీనినిని రాజకీయాలకు అతీతంగా ఖండించాల్సిన అవసరం ఉంది

తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనను కేంద్రం అడ్డుకోవడం తెలంగాణ అభివృద్ధిని వ్యతిరేకించడమే

కేంద్రం వైఖరి చూస్తోంటే స్పష్టంగా తెలంగాణపై వివక్ష కనిపిస్తోంది

మా ఎంపీలు ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తారు

గుజరాత్ అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందనే నా పర్యటనను కేంద్రం అడ్డుకుంది

ఇది రాజకీయ వివక్ష... తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే

మేమంతా కేంద్రం వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తున్నాం

ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

నా పర్యటనను అడ్డుకోవచ్చు.. నా లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకోలేరు

ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ను డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహిస్తున్నాం

విద్య, క్రీడల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తాం

ముఖ్యమంత్రి సరైన వివరాలు ఇవ్వలేదని మాట్లాడుతున్నారు..

ఇది అధికారిక పర్యటన.. మా కార్యక్రమాలు అన్నీ భారత రాయబార కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతుంది

ఇది చాటు మాటుగా జరిగే వ్యవహారం కాదు.. అన్ని వివరాలను విదేశీ వ్యవహారాల శాఖకు అందించాం

తెలంగాణ అంటే మోదీకి వివక్ష.. చిన్న చూపు..

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్ర

# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**అబద్ధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు**

**ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**22ఏ దరఖాస్తులు ఫాస్ట్‌ట్రాక్.లో పరిష్కరించాం- 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి..**

**22ఏలో లక్షల ఎకరాలు చేర్చారన్నది అవాస్తవం**

**ఎంత భూమి.. ఎందుకు 22ఏలో ఉందో రికార్డులతో మీడియా ముందు ఉంచుతున్నాం**

**తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమమైతే చర్యలు**

**నకిలీ జీఓలు.. బోగస్ మెమోలు.. ఫేక్ సర్టిఫికెట్లతో భూదందాలు**

**అక్రమార్కులపై క్రిమినల్ కేసులు**

**ప్రభుత్వ భూమిని ప్రైవేట్‌గా చూపిస్తే సహించం**

**యుఎల్‌సీపై త్వరలో విధాన నిర్ణయం**

**ప్రధాన ప్రతిపక్షం కోరితే జూ-7, జూ-14 భూ వ్యవహారంపై సెట్ దర్యాప్తు**

**రిజిస్ట్రేషన్ స్లాట్ రద్దుచేసుకున్న వారి సొమ్మును వారం రోజుల్లో చెల్లింపు**

**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**






రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంత మేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 22ఎ పేరిట ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. 22ఎ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి నిషేధిత జాబితాలో ఉన్న ఫారెస్ట్, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు.

సోమవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ.. లక్షలాది ఎకరాలు 22ఎలో పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డులతో చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటం 22ఏ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కు పైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు ఈ భూముల వ్యవహారం అప్పట్లో మీడియాలో కూడా చర్చకు వచ్చిందని, ప్రభుత్వ భూములను భారీ విస్తీర్ణాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం తప్పా ? ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి రెవెన్యూ గ్రామంలో 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపిస్తూ, సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే భూములపై హక్కులు సృష్టించి దారదత్తం చేశారు.

హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో సర్వే నంబర్ 403కు సంబంధించి సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అందులో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్‌ను పేర్కొనడం వల్ల ముఖ్యమంత్రి గారి నివాసంతో పాటు తన నివాసం కూడా పీఓబీలో చేర్చారని దానిని గుర్తించి వెంటనే సరిచేశామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేట్ భూమి అని, 173 పేరుతో అనుమతులు తీసుకుని 172 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన ఉదాహరణను మంత్రి వివరించారు. "ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే.. ఆ ప్రభుత్వ భూమిని 22ఏలో పెట్టకూడదా? 173లో కాదు, 172 ప్రభుత్వ భూమిలో పెట్టాం. ప్రభుత్వ భూమిని కాపాడటం మా బాధ్యత." అని వివరించారు. మేడ్చల్ జిల్లా పర్వతాపూర్ ప్రాంతంలో ప్రధాన రెవెన్యూ గ్రామం, దానికి అనుబంధ హ్యామ్లెట్‌కు ఒకే తరహా సర్వే నంబర్లు కేటాయించడం వల్ల భూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పారు. సర్వే నంబర్లను సక్రమంగా పునర్వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే ద్వారా ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

మహేశ్వరం మండలంలోని 22 ఎకరాల సర్వే నంబర్‌లో రెండు ఎకరాలను భూదాన్ భూమి ఉంటే మొత్తం 22 ఎకరాలకు పాస్‌బుక్ జారీ కావడం, భూదానం చేసిన రెండు ఎకరాలను ప్రత్యేకంగా గుర్తించడంలో సమస్య ఏర్పడడంతో మొత్తం 22 ఎకరాలను పీఓబీలో పెట్టడం జరిగిందన్నారు.

భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి, వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీఓలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలను గుర్తించామని ఆమేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలిస్తున్నామన్నారు.

మిగతా 2 లో

ప్రజాబలం

25 ఆగస్ట్ 2026 మంగళవారం

# భయపెడుతున్న విద్యా సంక్షోభం

భారత్‌లో మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో యువత డిగ్రీ పట్టాలతో కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. అయితే ఆ చేతికి అందుతున్న సర్టిఫికెట్‌లు మార్కెట్‌లో వారికి ఉద్యోగాలు లభించడం లేదని తేలింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యూహాత్మక, టెక్నికల్ సలహాలను అందించే అత్యున్నత థింక్ ట్యాంక్ నీతి ఆయోగ్ విడుదల చేసిన తాజా నివేదిక దేశంలోని విద్యారంగంలో ఉన్న ఒక భయానక సత్యాన్ని, విద్యా సంక్షోభాన్ని కళ్లకు కట్టినట్టు చూపించింది. నీతి ఆయోగ్ ప్రచురించిన రీఇమేజింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్ ఏ2047 అనే పత్రం భారత్‌లో విద్యావిధానానికి, ఉద్యోగ మార్కెట్ డిమాండ్లకు మధ్య ఉన్న అగాధాన్ని బయటపెట్టింది. ఆర్థిక సర్వే 2024–25 గణాంకాలను ఉటంకిస్తూ ఈ నివేదిక వెల్లడించిన అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే, భారత్‌లో కేవలం 8.25 శాతం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే తాము అభ్యసించిన చదువులకు, అర్హతలకు తగిన ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంటే మిగిలిన 91.75 శాతం మంది గ్రాడ్యుయేట్‌లు తాము చదివిన చదువుకు ఎటువంటి సంబంధం లేని పనుల్లో లేదా తక్కువ వేతనాల ఉద్యోగాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. లేదా అసలు ఉద్యోగమే లేకుండా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇది కేవలం నిరుద్యోగ సమస్య మాత్రమే కాదు, విద్యార్థుల చదువులకు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలనకు మధ్య ఏర్పడిన లోతైన అగాధం. ఈ సంక్షోభం ఎందుకు ఏర్పడింది, లక్షలాది మంది యువత జీవితాలు డిగ్రీలు ఉన్న ఎందుకు ఏర్పడింది? లక్షలాది మంది యువత జీవితాలు డిగ్రీలు ఉన్నా ఎందుకు నిరర్థకంగా మారుతున్నాయో నివేదిక చెప్పింది. ఈ నివేదికలోని అంశాలు సంచలనం సృష్టిస్తున్నాయి. యువత తమ అమూల్యమైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ఖర్చు చేసి డిగ్రీలు పొందుతున్నప్పటికీ, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన కనీస నైపుణ్యాలు వారిలో ఉండం లేదనే వాస్తవాన్ని ఈ నివేదిక నిరూపించింది. ఇది కేవలం ఒక విధానపరమైన పత్రం కాదు. భారత్‌లోని విద్యావ్యవస్థ మూలాలను ప్రశ్నించే ఒక తీవ్రమైన హెచ్చరిక మన విద్యా సంస్కరణలు తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే దేశ ఆర్థిక పురోగతి దెబ్బతినే ప్రమాదం ఉంది. భారత్‌లో ఉన్నత విద్య కోసం విపరీతంగా ఖర్చు చేసిన, సంవత్సరాల తరబడి శ్రమించి పట్టాలు పొందుతున్న యువత సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కానీ, ఈ డిగ్రీల వల్ల వారికి మంచి కెరీర్ లభించడం లేదు. భారత్‌లో ఉన్నత, టెక్నికల్ విద్యావ్యవస్థలో విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలకు, శ్రామిక మార్కెట్ ఆశించే నైపుణ్యాలకు మధ్య ఉన్న పెద్ద లోపం స్పష్టంగా కనిపిస్తోందని నీతి ఆయోగ్ గుర్తించింది. అనేక విద్యాసంస్థల్లో ఇప్పటికే కాలం చెల్లిన సిలబస్ బోధిస్తున్నారు. పరిశ్రమల అవసరాలు వేగంగా మారుతున్నప్పటికీ, ఆ మార్పులకు అనుగుణంగా సిలబస్ మారడం లేదు. దీని వల్ల విద్యార్థులు సాధించే డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లు వారి నైపుణ్యాలను ప్రతిబింబించలేకపోతున్నాయి. వారికి ఉపాధి కల్పించలేకపోతున్నాయి. ప్రస్తుత విద్యావ్యవస్థ కేవలం మార్కులు, పరీక్షల ఫలితాల ఆధారంగానే విజయాన్ని అంచనా వేస్తోంది. నిజమైన ఉపాధి సామర్థ్యాన్ని పెంచడం లేదు. డిగ్రీ పూర్తి చేసిన ఒక యువకుడు లేదా యువతి సమాంలోకి అడుగుపెట్టినప్పుడు , తాము సాధించిన చదువు మార్కెట్ అవసరాలకు ఎంతమాత్రం సరిపోవడం లేదని గ్రహిస్తున్నారు. ఈ పరిస్థితి గ్రాడ్యుయేట్లో నిరాశను పెంచుతోంది. భారత్‌లో సాధారణ సంప్రదాయ డిగ్రీల వైపు విద్యార్థులు విపరీతంగా ఆసక్తి చూపడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలోని గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. దే?శంలో అండర్ గ్యాడ్యుయేట్ కోర్సుల్లో చేసిన మొత్తం విద్యార్థుల సంఖ్య 3.4 కోట్లు. ఇందులో కేవలం బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్సుల్లోనే ఏకంగా 1.13 కోట్ల మంది చేరారు. ఇక బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులను కలిపి చూస్తే 2 కోట్లకు దాటిపోతుందీ సంఖ్య. భారత్‌లో ఉన్నత విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఒక భారీ ప్యాక్టరీలా మారింది. ఇది ఏటా లక్షలాది మంది గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తోంది. కానీ వారిలో ఎంతమంది ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారనే ప్రశ్న వచ్చినప్పుడు సమాధానం దొరకడం లేదు. దీనికి జనరిక్ డిగ్రీ వ్యవస్థే కారణం. ఈ సంప్రదాయ కోర్సులు విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పరీక్షిస్తాయే తప్ప వారిలో విశ్లేషణాత్మక ఆలోచనను, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంచవు. ఈ కారణంగానే చాలా కంపెనీలు డిగ్రీలు ఉన్నప్పటికీ కొత్త గ్రాడ్యుయేట్‌లకు మళ్లీ మొదటి నుంచి శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది. కనీసం ఈమెయిల్ రాయడం, ఎక్సెల్ షీట్ల తయారీ, టైపింగ్, లాంటి ప్రాథమిక నైపుణ్యాలు కూడా సంప్రదాయ బీఏ, బీఎస్సీ, కోర్సుల్లో నేర్పించడం లేదు. ఇది యువకులకు శాపంగా మారుతోంది. కార్పొరేట్ రంగానికి, ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు సంప్రదాయ చదువుల ద్వారా లభించపోవడంతో , దేశంలోని కోట్లాది మంది యువతకు ప్రభుత్వం ఉద్యోగాలే ఏకైక ఆశ్రయంగా మారుతున్నాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు సాధించాలంటే కావాల్సిన నైపుణ్యాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వ కొలువుల వైపు పరుగులు పెడుతున్నారు. నీటి ఆయోగ్ తన నివేదికలో కేవలం సిలబస్‌లోని లోపాలను మాత్రమే కాకుండా కళాశాలల నిర్వహణలోని అనేక ఇతర లోపాలను కూడా ఎండగట్టింది. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థల్లో కరికులం దాటి విద్యార్థులకు లభించాల్సిన కనీస ఉపాధి మద్దతు కొరవడిందని పేర్కొంది.విద్యాసంస్థల్లోని విద్యార్థులు కనీసం ప్రొఫెషనల్ రెజ్యూమ్ ఎలా రాయాలి, మాక్ ఇంటర్వ్యూలు ఎలా నిర్వహించాలి, ఉద్యోగాల కోసం ఎలా శోధించాలనే విషయాలపై ఎటువంటి అవగాహన ఉండటం లేదు. దీని వల్ల విద్యార్థులు నేరుగా జాబ్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు ప్రతిభ ప్రదర్శించలేకపోతున్నారుఅధ్యాపకులు సరికొత్త టెక్నాలజీ, సబ్జెక్ట్ బోధిస్తున్నప్పటికీ వారికి పరిశ్రమల అవసరాలపై కనీస అవగాహన ఉండటం లేదు. తగిన మౌలిక సదుపాయాలు, ల్యాబ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితమవుతున్నారు. ఈ లోపాలు దేశంలో ఒక విషవలయాన్ని సృష్టిస్తున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు అనుభవం ఉన్న అభ్యర్థును కోరుకుంటాయి. కానీ కొత్త పట్టాలు పొందిన గ్రాడ్యుయేట్‌లకు ఎలాంటి ప్రాక్టికల్ అనుభవం ఉండటం లేదు. కళాశాలలు పరిశ్రమలతో అనుసంధానం కాకపోవడం వల్ల విద్యార్థులకు ఆ అనుభవాన్ని కల్పించలేకపోతున్నాయి.

# ప్రజావాణికి(53)ఫిర్యాదులు




**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ--26, ఇతర శాఖలు --27, మొత్తం 53 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి

**--- అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.**



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు.

వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలుఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది.

రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క -- ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి

దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీ

అన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.

చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకం

తాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి

ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి (ఇఛా) శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి. ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

మొదటి పేజీ తరువాయి

మేడ్చల్ జిల్లాలో 22-04-2026 తేదీతో జిల్లా కలెక్టర్ సంతకం చేసినట్లు చూపిస్తూ ఒక నకిలీ మెమోను, మరోచోట 02-06-2026 తేదీతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో బోగస్ సర్టిఫికెట్లను సృష్టించి రిజిస్ట్రేషన్ కోరిన వ్యవహారాలను గుర్తించామని చెప్పారు.సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

రాష్ట్రంలో పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టం ( అర్బన్ ల్యాండ్ సీలింగ్ - యుఎల్సి) కి సంబంధించి కొద్దిరోజుల్లో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రిగారు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జూ-7, జూ-14కు సంబంధించి 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన పత్రిక ఎండి ఒక భూస్వామి నుంచి ఎస్ క్లాస్ బెంజి కారు తీసుకొని 5 డాక్యుమెంట్ల ద్వారా 811 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు ఆదేశిస్తామని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా నాదర్గుల్, మేడ్చల్--మల్కాజిగిరి ప్రాంతాల్లో యుఎల్సి క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను మంత్రి వివరించారు.యుఎల్సి క్లియర్ చేసుకున్న భూములకు సంబంధించిన జీఓలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని, యుఎల్సికి దరఖాస్తు చేయని లేదా క్లియరెన్స్ పొందని భూములు నిషేధిత జాబితాలో ఉండటం సహజమేనని చెప్పారు.యుఎల్సి క్లియర్ చేసుకున్న వారికి ఇబ్బంది లేదు. అవసరమైన పత్రాలు అందిస్తే ప్రభుత్వం పరిశీలించి క్లియర్ చేస్తుంది. కానీ యుఎల్సి కూడా చేయించుకోకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. రిపీటెడ్, ఓవర్‌ల్యాప్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ భూములు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని తెలిపారు.రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82, కామారెడ్డి నుంచి 44, యాదాద్రి భువనగిరి నుంచి 40, సిద్దిపేట నుంచి 35 కాల్స్ వచ్చినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏపై కొన్ని పత్రికల్లో వస్తున్నట్లుగా తీవ్ర సమస్య లేదని అన్నారు. ఇప్పటికే రిలాక్సేషన్ పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం స్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.సుమారు 300కు పైగా స్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు వీలు లేని 12--13 కేసులను మాత్రమే తిరస్కరించినట్లు చెప్పారు.రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతంలోపు ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించిన నిజమైన సమస్యలను 24 గంటల్లో, అవసరమైన సందర్భాల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు.. ప్రజలకు భరోసా కల్పించడం మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం" అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తాం.. ప్రతి రికార్డును ధృవీకరిస్తాం.. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ తప్పుడు ప్రచారంతో ప్రజలను భయాందోళనలకు గురి చేయడానికి మాత్రం ఈ ప్రభుత్వం అనుమతించదు అని అన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ ఛ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై నిరంతరంగా ఉద్యమిస్తాం

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వెల్లడి.**

**రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ విధానాలను ఎండగడతాం.**

**బీఆర్ఎస్ నాయకులు,రైతులు హెచ్చరిక**





**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెప్టెంబర్ 2 నాటికి 1000 రోజులు పూర్తి కానున్న సందర్భంగా, ఆ పార్టీ ఇచ్చిన హామీల వైఫల్యాలపై భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. సోమవారం అన్నారుగూడెం శ్రీ కళ్యాణ మహాలక్ష్మి మండపం నందు నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు,420 హామీలలో ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటి కూడా సమర్థవంతంగా అమలు కాలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి,జాబ్ క్యాలెండర్,4,000 పింఛన్,మహిళలకు 2,500 ఆర్థిక సాయం, ఎస్సీ,ఎస్టీలకు దళిత బంధు కంటే మెరుగైన తదితర పథకాల హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. ఈ దగా కోరు కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టేందుకు త్వరలో మా శ్రేణులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పాత్రికేయులకు ఆయన తెలియజేశారు. మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో త్వరలోనే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగకరమైన ముఖ్యమైన డిమాండ్ల తో మరియు నిరసన కార్యక్రమ ప్రణాళికలు తయారుచేసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ క్రమంలో గ్రామ గ్రామాన నిరసనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో విస్తృత స్థాయి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఉద్యోగులు,పెన్షనర్లకు మద్దతు టీఎన్జీవోలు,ప్రభుత్వ ఉద్యోగులు,రిటైర్డ్ సిబ్బంది బెనిఫిట్స్, పిఆర్సి సంబంధిత న్యాయమైన సమస్యలపై సెప్టెంబర్ 26 తర్వాత చేపట్టబోయే ఆందోళనలకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పునరుద్ధరణ లబ్ధిదారులకు పథకాలు దూరమయ్యే పరిస్థితులు రాకుండా ప్రభుత్వం తగిన రీతిలో కోర్టులో వాదనలు వినిపించి నిరుపేదలకు న్యాయం చేయాలి. సాగునీటి విడుదల తల్లాడ మండలానికి సిరిపురం మేజర్ ద్వారా సీతారామ సాగర్ జలాలు సకాలంలో విడుదల చేయాలి. ఇరిగేషన్ శాఖ అధికారులు ఇచ్చిన హామీ మేరకు నీటిని అందించకపోతే రైతాంగంతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాల ముట్టడికి వెనుకాడబోమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్డ శ్రీనివాసరావు,ఆ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహనరెడ్డి,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దుగ్గిదేవర వెంకట్ లాల్,జోనల్ నాయకులు దిరిశాల దాసురావు,దగ్గుల శ్రీనివాసరెడ్డి, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,తల్లాడ సర్పంచ్ పెరికే నాగేశ్వరరావు,ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,గోపాలపేట ఉప సర్పంచ్ శనక్కాయల సత్యనారాయణ,బీఆర్ఎస్ నాయకులు జివిఆర్,దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, కొమ్మినేని శ్రీనివాసరావు,రేగళ్ల సత్యం,నున్న చిన్నతిరుమలరావు,ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం వైద్యరంగంలో నవశకం..

**50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం.**

**మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**రూ.23.75 కోట్లతో అత్యాధునిక భవనాలు మరియు సదుపాయాల కల్పన**

**కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం**

**తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు**

**హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం**

**మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సాకారమైన కీలక ప్రాజెక్టు**





**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ సదుపాయం ఎంతో దోహదపడనుంది. ఇది కేవలం ఒక భవన ప్రారంభోత్సవం కాదు... ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల వేసిన అడుగులు కృషి నేడు ఫలించింది.

రూ.23.75 కోట్లతో రూపుదిద్దుకున్న అధునాతన నిర్మాణం...

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.23.75 కోట్ల భారీ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2023 జూన్ 7న జారీ అయిన జీవో ఆర్టీ నంబర్ 311 ద్వారా ఈ అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు వేగం పెరిగింది. రూ.12.66 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ చేపట్టగా, 2.79 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టు ఖరారు కావడం విశేషం. ఇప్పటివరకు నిర్మాణానికి సుమారు రూ.15.27 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

వైద్య పరికరాలకు రూ.8.48 కోట్లు కేటాయింపు..

మంజూరైన మొత్తం నిధుల్లో నిర్మాణ వ్యయం పోను మిగిలిన రూ.8.48 కోట్లను అత్యాధునిక వైద్య పరికరాల సమకూర్పుకు వినియోగించనున్నారు. దీనితో కేవలం భవనం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా క్రిటికల్ కేర్ చికిత్సలో నాణ్యత మరింత మెరుగుపడనుంది.

నాలుగంతస్తుల్లో సమగ్ర వైద్య సదుపాయాలు..

నాలుగు అంతస్తుల్లో విశాలంగా నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల అవసరాలకు అనుగుణంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు.

రెండు ఐసీయూ విభాగాల్లో 20 పడకల చొప్పున 40 పడకలు

20 పడకల జనరల్ వార్డు

5 పడకల డయాలసిస్ వార్డు

గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన క్రిటికల్ కేర్ సేవలను ఒకే చోట అందించే అవకాశం ఏర్పడనుంది.

హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..

ఇప్పటివరకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులను మెరుగైన క్రిటికల్ కేర్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రయాణ సమయం కీలకంగా మారేది. తాజాగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రానుండటంతో అత్యవసర సమయంలో విలువైన సమయం ఆదా కావడంతో పాటు రోగుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఖమ్మం జిల్లావాసులతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగు జిల్లాల ప్రజలు కూడా ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

ప్రభుత్వ వైద్యానికి మరింత బలం..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుండటం జిల్లా వైద్య రంగానికి ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం.

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనుంది.

## కరీంనగర్ జిల్లా పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల సతీష్ కు ఘన సన్మానం





**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 24**కరీంనగర్ జిల్లా పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై తొలిసారిగా జమ్మికుంటకు విచ్చేసిన ఆకుల సతీష్ ను జమ్మికుంట పట్టణ సీఐ ఎస్. రామకృష్ణ గౌడ్ మరియు మిత్ర బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ... పోలీసు సంక్షేమం కోసం, పోలీసుల సమస్యల పరిష్కారం కోసం ఆకుల సతీష్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆకుల సతీష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న పోలీసు సంక్షేమ సంఘం సభ్యులకు, తనకు సన్మానం చేసిన జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ కు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, పోలీసు కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే రేవంత్ రెడ్డి

**సీఎంపై కుమార్తె వ్యాఖ్యలతో కొండా సురేఖకు షోకాజ్ నోటీసు**

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమంటూ మంత్రి ఇచ్చిన వివరణ**

తెలంగాణ మంత్రి కొండా సురేఖకు పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన ఉదంతంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించబోనని, క్రమశిక్షణా సంఘమే దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వెల్లడించారు.

ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీపీసీసీ క్రమశిక్షణా సంఘం, వివరణ కోరుతూ మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, ఆ అంశానికి తనను బాధ్యురాలిని చేయవద్దని వివరణలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎవరూ అతీతులు కారని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# ఏపీలో ఫ్రెండ్లీ పోటీ తప్పదా

విజయవాడ, ఆగస్టు 24,రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా?రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా ఉన్న స్థానిక వర్గ పోరాటాలు, వ్యక్తిగత పట్టు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నాయకుడూ తన సొంత ఉనికిని కాపాడుకోవాలని భావించడం వల్ల పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలకు లోబడి సీట్లను త్యాగం చేయడం క్షేత్రస్థాయి కేడర్‌కు కష్టతరంగా మారుతోంది.గ్రామ రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న స్థానిక ఆధిపత్య పోరాటాలు కూటమి ఐక్యతకు ప్రధాన పరీక్షగా మారాయి. ఒకే పంచాయతీ లేదా వార్డులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి బలమైన నాయకులు ఉండటం వల్ల, ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా రెండో వర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో తమ ఉనికి కోల్పోతే భవిష్యత్ రాజకీయ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని కింది స్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా స్థానికంగా సర్దుబాటు కావడం అసాధ్యమని భావించే ప్రాంతాల్లో స్వతంత్రులుగానైనా బరిలోకి దిగాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.అధికారికంగా ఒకే అభ్యర్థిని బలవంతంగా రుద్దడం కంటే స్నేహపూర్వక పోటీలు ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ చిహ్నాల ప్రాతిపదికన జరగకపోవడం కూడా క్షేత్రస్థాయి నాయకులకు తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు కూటమి పార్టీల నేతలు బరిలో ఉన్నప్పటికీ, ప్రచారంలో హద్దులు దాటకుండా విపక్ష వైఎస్సార్‌సీపీకి మైలేజ్ రాకుండా చూసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.కూటమి అధిష్ఠానానికి స్థానిక సమన్వయం అతిపెద్ద పరీక్షగా నిలవనుంది. సమన్వయ కమిటీల ద్వారా సర్దుబాటు ప్రక్రియను ముందస్తుగానే పూర్తి చేయడం, నామినేటెడ్ లేదా ఇతర స్థానిక పదవుల హామీలతో అసంతృప్త నేతలను బుజ్జగించడంపై నాయకత్వం దృష్టి సారించింది. కింది స్థాయిలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను ప్రభావితం చేస్తుందనే భావనతో, ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంది.

# టూ, త్రీ సిటీస్ లో హోమ్ స్టేలు

విజయవాడ, ఆగస్టు 24, ఏపీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేస్తోంది. పట్టణాల్లో హోమ్ స్టేలను తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ హోం స్టేలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నిర్ణయించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. పట్టణాల్లో హోం స్టేలను గుర్తించే పనిలో ఉన్నారు అధికారులు. ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. సాధారణంగా పట్టణాలకు పనులపై వచ్చేవారు ఉంటారు. నగరాలకు సంబంధించి సందర్శనకు, ఆలయాలకు, పర్యటనల కోసం వస్తుంటారు. అటువంటి వారికి తక్కువ ఖర్చుతో వసతితో పాటు భోజనం అందించేలా ఈ హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధపడుతోంది ఏపీ ప్రభుత్వం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచేలా ఏర్పాట్లు చేస్తోంది.విశాఖ నగరాన్ని తీసుకుందాం. ఇక్కడకు చాలామంది పర్యాటకులు వస్తుంటారు. వారికి సరైన వసతి ఎక్కడ దొరుకుతుందో తెలియదు. అందుకే అధిక ధర వెచ్చించి హోటల్ గదుల్లో దిగుతుంటారు. అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఈ హోం స్టేలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది అనేది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం. మరోవైపు సంక్రాంతి సంబరాల సమయంలోనూ వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడే ఉండి సంక్రాంతి వేడుకలను తిలకిస్తుంటారు. అయితే బంధుమిత్రులు ఉన్నవారు పర్వాలేదు కానీ.. లేని వారికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అటువంటి సమయంలో ఈ హోం స్టేలు అనేవి ఎంతగానో దోహదపడతాయి. సాధారణంగా ప్రముఖ ఆలయాలు సైతం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. వాటిని సందర్శించే సమయంలో సైతం వసతి సమస్య ఏర్పడుతుంది. అటువంటి వారికి సైతం హోమ్ స్టేలు ఎంతగానో ఉపయోగపడతాయి. తక్కువ ధరకు పర్యాటకులకు వసతి కల్పించడంతో పాటు.. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలి అనేది ఈ హోం స్టేల ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు ఆధ్వర్యంలో పట్టణాల్లో హోం స్టేలు సిద్ధం చేసేలా కసరత్తు జరుగుతోంది. అయితే స్థానికంగా ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు వారికి వివరించేలా బాధ్యతను కూడా అప్పగిస్తారు. ఎక్కడో అద్దెకు ఉన్నాం అన్న భావన లేకుండా.. అతిథులు మాదిరిగా ఆతిథ్యం పొందే వీలుగా ఈ హోం స్టేలు ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా ఆసక్తి ఉండి దరఖాస్తు చేసుకుంటే ముందుగా ఆ ఇళ్లను అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారి సత్ప్రవర్తన కూడా పరిశీలించనున్నారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు కూడా ఉండకూడదు. అలాగే అతిథులకు సదుపాయాలు, గౌరవంగా వ్యవహరించడం వంటి అంశాలపై నిర్వాహకులకు శిక్షణ ఇవ్వనున్నారు హోమ్ స్టేకు కనీసం ఒక బెడ్ రూమ్ రెండు పడకలతో.. గరిష్టంగా ఆరుగదులు 12 బెడ్లతో ఉండాలి. సదరు ఇంటి యజమాని తన కుటుంబంతో అదే ప్రాంతంలో నివాసం ఉండాలి. ఒకవేళ అనుబంధంగా ఉండే బెడ్, బ్రేక్ ఫాస్ట్ కోసం యజమాని, ప్రమోటర్ అదే ప్రాంతంలో నివా నివాసం ఉండాల్సిన అవసరం లేదు. అటువంటి వారు అతిథులకు అవసరం అయినా సేవలు అందించేందుకు ఒక ప్రతినిధిని నియమించుకోవాల్సి ఉంటుంది. కాగా దాదాపు అన్ని ప్రముఖ పట్టణాల్లో మెప్మా అధికారులు అప్పుడే కసరత్తు ప్రారంభించారు.

# ఏపీలో ఏకంగా 10 వేల పోస్టులు

విజయవాడ, ఆగస్టు 24, ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలి విడతలో 1523 పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే ఇది నిరుద్యోగులకు ఒక సువర్ణ అవకాశం. ఇప్పటికే మరో డీఎస్సీకి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ప్రభుత్వ శాఖల్లో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించడం మాత్రం శు భపరిణామం.పదివేల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రక్రియలో భాగంగా.. రెండో దశ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 3231 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వీటిలో అత్యంత కీలకమైన గ్రూపు 1 కేటగిరీలో 149 పోస్టులు ఉన్నాయి. మరోవైపు పోలీస్ విభాగంలో భారీ ఉద్యోగాల భర్తీ జరగనుంది. ఇందులో 542 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు 152 సివిల్ ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. ఇక మూడో దశ నోటిఫికేషన్ ను అక్టోబర్ 15న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏకంగా 2311 ఉద్యోగాలను భర్తీ చేయనుండగా.. ఇందులో గ్రూప్ 2 కేటగిరి కింద 673 పోస్టులు ఉన్నాయి. ఇందులో అత్యంత కీలకమైన డిప్యూటీ తహసిల్దార్ పోస్టులు 200 వరకు ఉన్నాయి. వీటితో పాటు వివిధ ఇంజనీరింగ్ సర్వీసులు, ఇతర సాంకేతిక, పరిపాలన విభాగాల్లో 1638 పోస్టులను కూడా మూడో దశలో నోటిఫై చేయనున్నారు.మరోవైపు అక్టోబరు 15న నాలుగో దశ కింద 2995 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కానుంది. ఈసారి విద్యాశాఖలో ఎక్కువ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఒక్క స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంలోనే ఏకంగా 2,991 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇలా ఏకకాలంలో గ్రూప్స్, పోలీస్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయ కొలువుల భర్తీకి స్పష్టమైన షెడ్యూల్ తో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది. మరోవైపు డీఎస్సీ 2026 కు కూడా ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. అక్టోబర్లో డీఎస్సీ ప్రకటనకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. అయితే వరుసగా ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వం పట్ల సంతృప్తి నెలకొంది.

# స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..

గుంటూరు, ఆగస్టు 24, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది.శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయినా సరే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దానికి కారణం వారసులను రాజకీయంగా సెట్ చేయడమే. కుమార్తెతో పాటు కుమారుడు ఇద్దరూ వైద్యులే. కానీ ఇంతవరకు వారు పొలిటికల్ గా సెట్ కాలేదు. అందుకే తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. కుమారుడు సందీప్ ను చీపురుపల్లి ఎమ్మెల్యే గారు చూడాలనుకుంటున్నారు బొత్స. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో తన కుమార్తె పేరును జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవి కోసం జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. మరోవైపు తాను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే తన కుమారుడికి జిల్లా పరిషత్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు తమ్మినేని. అయితే ఈ సీనియర్లంతా అంతిమంగా ఒకటే ఆలోచన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓట్లు, గ్రాఫ్ పెరిగితే పరవాలేదు.. లేకుంటే మాత్రం పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోవడమనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# టెంపుల్స్ కు అనుసంధాన రోడ్లు

నెల్లూరు, ఆగస్టు 24, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో.. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు రోడ్ల అనుసంధాన ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రాష్ట్రంలోని100కుపైగా ప్రధాన క్షేత్రాలకు గ్రామీణ రోడ్ల అనుసంధానం చేపడుతున్నారు. రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల పొడుగున ప్రధాన ఆలయాలకు అనుసంధాన రహదారులు నిర్మిస్తున్నారు. ఐ.ఎస్.జగన్నాథపురం, అహోబిలం వంటి క్షేత్రాలకు గ్రామీణ రహదారులను అనుసంధానిస్తు?న్నారు. వీటిలో 40 శాతం రోడ్లు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు దేవాలయాలకు రహదారుల నిర్మాణం జరుగుతోంది. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో సరైన రహదారి సౌకర్యం లేని దేవాలయాలను ఆయన గుర్తించారు. కొన్ని ఆలయాల దుస్థితిని ప్రజలు వినతపత్రాల రూపంలో పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో దేవుని దర్శనానికి వెళ్లే దారి లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని పవన్ కళ్యాణ్ సంకల్పించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా వందకు పైగా ప్రధాన క్షేత్రాలను 205 కిలోమీటర్ల పొడుగున రోడ్లతో అనుసంధానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ నిధులతో వీటి నిర్మాణం చేపడుతున్నారు.శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి అనుసంధాన రోడ్ల నిర్మాణానికి పవన్ కళ్యాణ్ రూ.30 కోట్లు కేటాయించారు. ఈ పనులు అత్యంత వేగంగా పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు.. రూ. 120 కోట్ల వ్యయంతో రహదారులు నిర్మిస్తు?న్నారు. వీటిలో ఇప్పటికే 26 శాతం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభం కోసం సిద్ధంగా ఉన్నాయి. మరో 40 శాతం రహదారులు యాభైశాతం పనులు పూర్తి చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.అంతర్వేది, అహోబిలం, మదనపల్లి గట్టు వెంకటరమణ స్వామి ఆలయం,దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, పుడియగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం తలుపులమ్మలోవ మార్గం, ఐ.ఎస్ జగన్నాథపురం ఘాట్ రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాస్కీ నిధులతో చేపట్టిన వివిధ రహదారుల పనులు వివిధ స్థాయిల్లో పురోగతిలో ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో దాదాపు 72 కిలోమీటర్ల రోడ్లు సైతం వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి.పుణ్య క్షేత్రాలకు వెళ్ళే రోడ్ల నాణ్యతా ప్రమాణాల విషయంలో శ్రద్ధ వహించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ నిర్మించే రోడ్లు భక్తులకు సుదీర్ఘ కాలం ఉపయోగపడాలని సూచించారు.

క్షేత్ర స్థాయి పర్యటనల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆలయాల రోడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించి, భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

# రోడ్ల మీద గ్రీన్ ఈవీ బస్సు

తిరుపతి, ఆగస్టు 24, ఏపీఎస్ఆర్టీసీ కన్వెర్షన్ ఏసీ ఇంద్ర బస్సు రోడ్డెక్కింది. పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ పాత సూపర్ లగ్జరీ బస్సును విజయవాడలోని వర్క్‌షాప్‌లో విద్యుత్ బస్సుగా మార్చింది. విజయవాడతో పాటుగా తిరుపతిలో పలు దశల్లో ట్రయల్ రన్ నిర్వహించారు.. తాజాగా ఈ గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి నడిపింది.ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలవుతోంది.. దీంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈ కారణంగా అదనంగా బస్సులు అవసరమయ్యాయి.. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి విద్యుత్ బస్సులు విడతలవారీగా వస్తున్నాయి. కొత్త బస్సులతో పాటుగా ఏపీఎస్ఆర్టీసీ మరో వినూత్నమైన ఆలోచన చేసింది.. పాత బస్సుల్ని ఏసీ ఈవీ బస్సులుగా మారుస్తోంది. పాత సూపర్‌లగ్జరీ బస్సును పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ తక్కువ ఖర్చుతో రెట్రోఫిట్మెంట్ ద్వారా గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ విద్యుత్ బస్సు రెండు నెలల క్రితం విజయవాడ నుంచి తిరుపతికి తీసుకొచ్చారు. అనంతరం బస్సుకు సంబంధించిన రిజిస్ట్రేషన్, రోడ్డు కన్వెర్షన్ సహా అవసరమైన అనుమతులు తీసుకున్నారు. జులై 24న ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకం ట్రయల్ రన్ నిర్వహించారు.. ఆ తర్వాత బస్సును రెగ్యులర్ సర్వీసుగా ప్రారంభించాలని భావించారు. కానీ ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వస్తోంది.. దీంతో ఆర్టీసీ అధికారులు ఈ బస్సు డిపోలో ఖాళీగా ఉంటుందని గమనించారు. ఇలా ఖాళీగా ఉంచే బదులు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తే మంచిదని భావించారు.ఈ నెల 16న కాణిపాకానికి ఈ బస్సు రెండు ట్రిప్పులు నడిచింది.. ఆ సమయంలో కొన్ని లోపాలు గుర్తించారు. ఈ నెల 17న ఈ బస్సును గ్యారేజీకి తీసుకెళ్లి లోపాలను సరిచేశారు. ఈ విద్యుత్ బస్సు మంగళవారం రోజు తిరుపతి నుంచి కాణిపాకానికి 22మంది ప్రయాణికులతో బయలదేరి వెళ్లింది. అనంతరం కాణిపాక నుంచి చిత్తూరు వెళ్లి అక్కడ అవసరమైన కొన్ని తనిఖీలు చేసిన తర్వాత మళ్లీ 20మంది ప్రయాణికులతో తిరుపతి చేరుకుంది. మొత్తం మీద ఏపీఎస్ఆర్టీసీ చేసిన ప్రయోగం విజయవంతం అయ్యింది. గ్రీన్ ఇంద్ర ఏసీ బస్సు అందరిని ఆకట్టుకుంటోంది.పాత సూపర్ లగ్జరీ బస్సును విజయవాడలోని వర్క్‌షాప్‌కు తరలించి విద్యుత్ బస్సుకు అవసరమైన మార్పులు చేశారు. రూ.90 లక్షలతో గ్రీన్ ఇంద్ర బస్సుగా మార్చారు. విజయవాడలోనే అవసరమైనన అన్ని ట్రయల్ రన్స్ నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది జూన్ నెలలో ఈ బస్సును విజయవాడ నుంచి తిరుపతికి పంపించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ బస్సు గంటన్నరలోనే ఛార్జ్ అవుతుంది.. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళుతుంది.

పాత బస్సుల్ని అలా వదిలేయకుండా ఇలా విద్యుత్ బస్సులుగా మారిస్తే బావుంటుందనే ఆలోచన చేస్తున్నారు. మొత్తం మీద ఆర్టీసీ గ్రీన్ ఇంద్ర బస్సు అందుబా?టులోకి వచ్చింది.

## 22జీ జీవోను రద్దు చేయాలని లేదంటే అసెంబ్లీని నడవనీయం

## హరీష్ రావు హెచ్చరిక

హైదరాబాద్ తెలంగాణ ప్రభుత్వం వెంటనే 22జీ జీవోను రద్దు చేయాలని లేదంటే అసెంబ్లీని నడవనీయమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. బోడుప్పల్ లోని తిరుమల మీడోస్ కాలనీలో 22ఏ భూ బధితులతో హరీష్ రావు ముఖాముఖీ నిర్వహించారు. హరీష్ రావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఈ జీవో వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిషన్ల కోసమే ఈ జీవోను ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలోకి తీసుకొచ్చిందని అన్నారు. పిల్లల చదువుల కోసం, ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఇల్లు, ఫ్లాట్ అమ్ముకోవాలంటే అమ్మ లేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ప్రభుత్వం 30% కమిషన్ల కోసమే ఈ జీవుని తీసుకొచ్చి దండుకుంటుందని అన్నారు. రాత్రికి రాత్రే భూభారతి పోర్టల్ ను వెబ్సైట్లో నుండి తీసేసారని మొత్తం హైదరాబాదుని భూభారతి పోర్టల్ లో లేకుండా చేశారు. విలువైన ప్రభుత్వ భూములు మాయం అవుతాయేమోనని ప్రజల అనుమానం. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వమే కొత్త సమస్యలను సృష్టిస్తుందని అన్నారు.

## తీజ్ ఉత్సవాలకు హాజరయిన కవిత

హైదరాబాద్ సైదాబాద్ సింగరేణి కాలనీలో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోరె మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తీజ్ ఉత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత హాజరయ్యారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన ఉత్సవాల్లో బంజారా సంప్రదాయాల ప్రకారం యువతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గింజలతో ఏర్పాటు చేసిన మూడు వేల బుట్టలకు రోజుకు మూడుసార్లు నీళ్ల పోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

# జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు


**ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాం**
**ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ**
**నారాయణఖేడ్ లో బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో**
**మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి**

నారాయణఖేడ్ ఈ పర్యటనలో నారాయణఖేడ్ పట్టణంలో ఆధునికంగా ఏర్పాటుచేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన ఆసుపత్రి నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలకు సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులను, ప్రజా వైద్య, ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న సేవలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ హరిణి,



ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మరిపెడలో 25న ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం



మరిపెడ: మరిపెడ మండల కేంద్రంలోని భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 25, 2026న మధ్యాహ్నం 1:30 గంటలకు ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సోషల్ మీడియా విభాగం తెలిపింది. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించనున్నారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను ఎమ్మెల్యే అందించనున్నారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, బీఎల్‌ఏలు, గ్రామ పార్టీ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నిర్ణీత సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోరింది.

# ఎన్నికల బరిలో జనసేన

హైదరాబాద్, ఆగస్టు 24, తెలంగాణలో ఎన్నికలకు జనసేన ముందుగానే సిద్ధమైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావును ప్రకటించింది. గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన గడల శ్రీనివాసరావు.. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావుల సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణలో జరిగే ఎన్నికలకు పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన జనసేన పార్టీ అధ్యక్షుడుపవన్ కళ్యాణ్.. ఆ దిశగా ముందస్తుగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలోనే జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన పార్టీ ఫోకస్ పెంచింది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించి రాజకీయంగా ముందడుగు వేసింది. ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి డాక్టర్ గడల శ్రీనివాసరావును తమ అభ్యర్థిగా జనసేన పార్టీ తాజాగా ప్రకటించింది. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించినట్లు అర్థమవుతోంది. ఇతర ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్న సమయంలోనే జనసేన తమ అభ్యర్థిని ప్రకటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముందస్తు ప్రకటనతో ప్రచారం, పట్టభద్ర ఓటర్లతో సంబంధాలు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ఎక్కువ సమయం కేటాయించే అవకాశం పార్టీకి లభించనుంది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్.. డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ తెలిపింది. ఆయన అభ్యర్థిత్వానికి పవన్ కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో అధికారికంగా పేరును ప్రకటించినట్లు వెల్లడించింది. డాక్టర్ గడల శ్రీనివాసరావు గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో సేవలందించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలను గడల శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపిస్తానని గడల శ్రీనివాసరావు తెలిపారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పవన్ కళ్యాణ్‌తో పాటు రామ్ తాళ్లూరి, శంకర్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, ఉన్నత విద్యావంతులు, మేధావుల మద్దతు కూడగట్టడంపై జనసేన పార్టీ దృష్టి పెట్టనుంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన ప్రవేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# అంజయ్యనగర్ భవన కూల్చివేత కేసులో బిల్డర్ అరెస్ట్

**దేశం విడిచి పారిపోయేందుకు యత్నిస్తుండగా షంషాబాద్‌లో పట్టుకున్న పోలీసులు**

గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఉ+7 అంతస్తుల భవనం కూలిన ఘటనలో పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి బిల్డర్ సయ్యద్ సాజిద్ (39)ను రాత్రి రాయదుర్గం పోలీసులు షంషాబాద్‌లో అరెస్ట్ చేశారు. దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 22న మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో అంజయ్యనగర్‌లోని ప్లాట్ నంబర్ 113/131/1, సర్వే నంబర్ 135లో నిర్మాణంలో ఉన్న ఉ+6 భవనం ఒక్కసారిగా కుప్పకూలిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేష్ ఖరే (45), మోహ్‌పాల్ భలావి (46) మృతి చెందారు. భవనం కూలడంతో పక్కనే ఉన్న జయదర్శిని రెసిడెన్సీ సి-బ్లాక్ కూడా దెబ్బతింది. ఈ ఘటనలో 75




ఏళ్ల కె.వి. రమణారెడ్డితో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. అనుమతులు లేకుండానే నిర్మాణం? ఘటనపై జయదర్శిని రెసిడెన్సీకి చెందిన తక్కల వెంకట్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 945/2026, ఃఔా సెక్షన్ 105, 3(5) కింద కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. భవన నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ అధికారుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోలేదని, తప్పనిసరి సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించలేదని, పక్కనే ఉన్న నాలాను ఆక్రమిస్తూ నిర్మాణం చేపట్టారని, నాసిరకం నిర్మాణ సామగ్రిని ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. భవన నిర్మాణాన్ని బిల్డర్ సయ్యద్ సజీద్ అలియాస్ సయ్యద్ సాజిద్ చేపట్టగా, కాంట్రాక్టర్‌గా ఖాజా మొయినుద్దీన్ అలియాస్ మహమ్మద్ ఖాజా మియా వ్యవహరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ పరారీప్రధాన నిందితుడైన బిల్డర్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, సహ నిందితుడు, కాంట్రాక్టర్ ఖాజా మొయినుద్దీన్ పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ రెడ్డి, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, ఆదేశాల మేరకు, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ టి. భూపతి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ కేసులో కీలక ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. భవన నిర్మాణానికి అనుమతులు లేకపోతే ఇంత భారీ నిర్మాణం ఎలా కొనసాగింది? సెట్‌బ్యాక్‌లు, నాలా ఆక్రమణ, నిర్మాణ నాణ్యతపై సంబంధిత అధికారులు ముందుగానే ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

# అక్రమ నిర్మాణాల సాజిద్...

హైదరాబాద్, ఆగస్టు 24, హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం అనంతరం బిల్డర్ సయ్యద్ సాజిద్ నిర్మాణాలపై పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. చిన్న స్థలాల్లో అనుమతులకు మించి బహుళ అంతస్తుల భవనాలు, హాస్టళ్లు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పార్కు స్థలాన్ని ఆక్రమించి మరో నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. సాజిద్ నిర్మాణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలు, అధికారుల పాత్రపై అధికారులు దృష్టి సారించారు. హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కుప్పకూలిఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నాలా పక్కన కేవలం 48 గజాల స్థలంలో నిర్మిస్తున్న ఈ భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు కార్మికుల మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే , మోపత్‌గా గుర్తించారు. ప్రమాదం అనంతరం భవనం నిర్మాణం, అనుమతులపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో బిల్డర్ సయ్యద్ సాజిద్‌కు సంబంధించి పలు సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సాజిద్ నిర్మించిన పలు భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. చిన్న స్థలాల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మించి వాటిని హాస్టళ్లుగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాజిద్ గతంలో తన తండ్రి వద్ద కారు మెకానిక్‌గా పనిచేసిన తర్వాత రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలోకి వచ్చినట్లు సమాచారం. నాలుగేళ్లుగా భూవివాదాలు, నిర్మాణాలపై దృష్టి పెట్టి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, కొందరు అధికారులు, కబ్జాదారులతో కలిసి భూములను తక్కువ ధరలకు సొంతం చేసుకుని, వాటిపై బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి విక్రయించినట్లు ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మూడేళ్లలో సాజిద్ ఐదు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో రెండు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అంజయ్యనగర్‌లో ప్రమాదం జరిగిన సమయంలోనే సమీపంలోని మరో భవనంలో ఆరో అంతస్తు స్లాబ్ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాజిద్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ఆక్రమించి అక్కడ కూడా ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో నిర్మాణ రంగంలోకి ప్రవేశించినట్లు సమాచారం. అనంతరం సరైన ఇంజినీరింగ్ ప్రణాళికలు లేకుండానే కాంట్రాక్టులు తీసుకుని హాస్టళ్లు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులకు లంచాలు ఇచ్చి అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి. ప్రమాదంపై పోలీసు, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, హైడ్రా అధికారులు సమన్వయంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్మాణ అనుమతులు, భవన భద్రత, నిబంధనల అమలుపై కఠిన పర్యవేక్షణ అవసరమని స్థానికులు అంటున్నారు.

# తల్లిదండ్రుల హత్యకేసులో నిందితురాలు ఆత్మహత్య



వికారాబాద్ ప్రియుడి మోజులో పడి కన్న తల్లిదండ్రులకు సూది మందులో విషమిచ్చి హత్య చేసిన నర్సు సురేఖ ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఆత్మహత్య చేసుకుంది. దాంతో సంగారెడ్డి పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతురాలు తల్లిదండ్రుల హత్యకేసులో జైలు శిక్షణ అనుభవించి ఈ మధ్యనే బైల్ పై వచ్చింది. బైల్ పై వచ్చినప్పటి నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉంటోంది. సురేఖ మృతికి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# సధిక్ ఖాన్ ను కాకినాడకు తెచ్చిన పోలీసులు

కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు సాధిక్ ఖాన్ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న కాకినాడ జిల్లా పోలీసులు, ఢిల్లీ నుంచి రైలులో సాధిక్ ఖాన్ను కాకినాడకు తరలించారు. రైలు సామర్లకోటలో కాకుండా జి.మేడపాడు వద్ద ఆగడంతో అక్కడే సాధిక్ను దింపారు. జి.మేడపాడు నుంచి వాహనంలో కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్ స్టేషన్కు తరలించారు. సాధిక్ ఖాన్ను తీసుకొచ్చే క్రమంలో పోలీసులు అత్యంత గోప్యత పాటించినట్లు సమాచారం. ప్రస్తుతం సాధిక్ ఖాన్ను అడిషనల్ ఎస్పీ కిషోర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. విచారణలో ఆరుగురు సీఐలు పాల్గొంటున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించి సాధిక్ ఖాన్ను విచారిస్తున్నారు.

# పేరు గొప్ప... ఊరు దిబ్బ

## 150 టాప్ కంపెనీలకు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 24, దేశంలోని ఫుడ్ కంపెనీలు, రెస్టారెంట్లు, హోటల్స్ కనీసం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఇటీవల కొద్ది రోజులుగా దీనిపై ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మెరుపు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో పలు దిగ్గజ కంపెనీలకు కొద్ది నెలల్లోనే 150 కిపైగా నోటీసులు జారీచేసినట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా వివరాలను ప్రకటించింది. వీటిలో ఈ కామర్స్ కంపెనీలు కూడా ఉన్నాయి.వినియోదారులను ఆకట్టుకోడానికి మోసపూరిత ప్రకటనలు, తప్పుడు వాదనలు, లేబెలింగ్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతోన్న పలు సంస్థలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల అధికార సంస్థ కఠిన చర్యలు చేపట్టింది. నెస్లే ఇండియా, పెప్సికో, కోకా-కోలా వంటి ప్రముఖ దిగ్గజాలు సహా పలు కంపెనీలకు గత కొన్ని నెలల్లో 150కి పైగా నోటీసులు జారీ చేసినట్లు తాజాగా ప్రకటించింది. నెస్లే, పెప్సికో, అబాట్ ఇండియా, రెడ్ బుల్, డానోన్, మోండెలెజ్ (డైరీ మిల్క్), కోకా-కోలా, డయాజియో, ఫెర్రెరో ఇండియా వంటి బడా సంస్థలకు ఈూాంఎ నోటీసులు ఇచ్చింది.కేఎఫ్సీ (మెక్‌డొనాల్డ్స్, పిజ్జా హట్, డోమినోస్, కాఫీ డే వంటి ప్రముఖ ఫుడ్ సర్వీస్ సంస్థలకు 30కి పైగా నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా నిబంధనలు పాటించని డోమినోస్‌కు చెందిన 5 లైసెన్స్‌లను రద్దు చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినందుకు గాను ఓ అమెజాన్ వేర్‌హౌస్ లైసెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. ఈ కామర్స్ కంపెనీలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు 12 నోటీసులు జారీచేసింది.ఎనర్జీ డ్రింక్స్ తయారీ సంస్థలు (మోన్‌స్టర్, హెల్), ఆల్కహాలిక్ పానీయ సంస్థలపై కూడా దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నోటీసులు అందుకున్న తర్వాత అనేక కంపెనీలు తమ ప్రకటనలు, లేబెలింగ్‌లలో సరిదిద్దుకునే చర్యలు ప్రారంభించాయని వెల్లడించింది. ఇటీవల దేశవ్యాప్తంగా పలు మెట్రో సిటీలు సహా అనేక నగరాల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ నేతృత్వంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఫైవ్‌స్టార్ హోటల్స్, బడా రెస్టారెంట్లలో అపరిశుభ్ర పరిస్థితులకు కళ్లకు కడుతున్నాయి. వందలాది కిలోల కుళ్లిపోయిన మాంసం, పాడైపోయిన ఆహార పదార్థాలు చూసి అధికారులే విస్తుపోతున్నారు. ఇటీవల బెంగళూరులోని కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యే క్యాంటీన్లలో గడువు ముగిసిన సరుకులను గుర్తించిన సంగతి తెలిసిందే. అక్కడ ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ కస్టమర్లకు అందించే ఆహారంలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వెల్లడయ్యింది. దిగ్గజాలుగా చెలామణి అవుతోన్న ఆహార ఉత్పత్తి సంస్థలదే అదే దారి.

# ఈడీ దూకుడు ? దేనికి సంకేతం?

హైదరాబాద్, ఆగస్టు 24, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు సంచలనాత్మక కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హఠాత్తుగా కొత్త వేగం ప్రదర్శిస్తోంది. ల గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ. 195 కోట్లకు పైగా విలువైన మద్యం రవాణా స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్‌ను అరెస్టు చేయడం, ఫ్రైడ్‌న్ర్నాకాన్ లాంటి సంస్థల చుట్టూ ఉచ్చు బిగించడం ఒక ఎత్తైతే.. ఏళ్ల తరబడి మూలనపడి ఉందనుకున్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మనీ ట్రయల్ కోణాన్ని వెలికితీస్తూ ఈడీ సోదాలు నిర్వహించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. వైఎస్ అవినాష్ రెడ్డి ఇంట్లో సోదాలు చేసి నగదుతో పాటు రెండు డిపాజిట్ లాకర్లను స్వాధీనం చేసుకోవడం ఈ కేసును కేవలం హత్యకేసుగానే కాక ఫైనాన్షియల్ క్రైమ్ గా మార్చేశాయి. అసలు ఏపీ కేంద్రంగా ఈడీ ఈ స్థాయి ఆర్థిక ఉగ్రవాద వేట ఎందుకు వేగవంతం చేసింది? దీని వెనుక ఉన్న అసలైన సంకేతాలేంటి?మొదటి కోణంలో చూస్తే.. ఇది వ్యవస్థాగతంగా సాగుతున్న మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన సాధారణ కేసు . సీబీఐ, రాష్ట్ర విజిలెన్స్ నమోదు చేసిన షెడ్యూల్డ్ నేరాల ప్రాతిపదికన ఈడీ రంగంలోకి దిగడం సాధారణమే. అయినప్పటికీ.. ఫాలో ది మనీ సూత్రాన్ని ఈడీ పక్కాగా అమలు చేస్తోంది. వివేకా హత్య కేసులో రూ. 40 కోట్ల సుపారీ చేతులు మారిందనే ఆరోపణలు, మద్యం రవాణా టెండర్లలో స్థానిక సిండికేట్లకు కట్టబెట్టి కిలోమీటరుకు 13 ఉండే ఛార్జీని 35కి పెంచి ఖజానాకు నష్టం చేకూర్చారనే వ్యవహారాలు సాధారణ నేరాలు కావు. అక్రమ మార్గాల్లో సమకూరిన నేరపూరిత ఆదాయం రాజకీయ, వ్యాపార సామ్రాజ్యాల్లోకి హవా లావాదేవీలుగా, డిజిటల్ నెట్‌వర్క్‌లుగా ఎలా మళ్లిందో ఆధారాలతో సహా సేకరించేందుకు ఈడీ విచారణను నిశితంగా చేపట్టింది.ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత, గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాథమిక విచారణల నివేదికలు, సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా కేంద్ర దర్యాప్తు సంస్థలకు స్పష్టమైన డాక్యుమెంటెడ్ ఆధారాలు' లభించాయి. లీగల్ వ్యూహంతో ముందుకు వెళుతూ కోర్టులలో నిలబడే పక్కా డిజిటల్, ఫైనాన్షియల్ ఆడిటింగ్ ప్రాతిపదికన నోటీసులు, సమన్లు జారీ చేస్తోంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సంబంధించి వారానికో సంచలనాత్మక అప్‌డేట్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. హత్య కేసులైనా, ప్రభుత్వ శాఖల టెండర్లయినా.. అక్రమ సంపాదన ఎక్కడ దాగి ఉన్నా లాకర్లు తెరవాల్సిందేనన్న సందేశాన్ని కేంద్ర సంస్థలు స్పష్టం చేశాయి. రాబోయే కాలంలో తెరుచుకోబోయే ఆ రెండు లాకర్లు', సీజ్ చేసిన డిజిటల్ సాక్ష్యాలు ఏపీ రాజకీయాల్లో ఎవరెవరి భవితవ్యాన్ని తిరగరాస్తాయో తేలాల్సి ఉంది.

# సికింద్రాబాద్ స్టేషన్ ప్రయాణికులకు వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్

హైదరాబాద్, ఆగస్టు 24, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఎయిర్‌పోర్ట్ తరహా ప్రపంచస్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత డిసెంబర్ నుంచి ప్రయాణికులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. రోజూ దాదాపు 180 రైళ్లు ఈ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నాయి. ఆధునీకరణ తర్వాత ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను రూపొందిస్తున్నారు.స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా పార్కింగ్ సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు తమ వాహనాలను పార్క్ చేయడంతో పాటు ఛార్జింగ్ చేసుకునేలా పార్కింగ్ ప్రాంతాల్లోనే ప్రత్యేక మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. బోయిగూడ వైపు బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే 120 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 100 పాయింట్లు నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాల కోసం, మరో 20 పాయింట్లు ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. దీంతో రైల్వే స్టేషన్‌కు కార్లు, బైక్‌లపై వచ్చే ప్రయాణికులకు ఒకేచోట పార్కింగ్‌తో పాటు ఛార్జింగ్ సదుపాయం లభించనుంది.మరోవైపు గణేశ్ టెంపుల్ వైపు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 80 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. నాలుగు చక్రాల వాహనాల కోసం 60, ద్విచక్ర వాహనాల కోసం 20 ఛార్జింగ్ పాయింట్లు కేటాయించారు. బోయిగూడ, గణేశ్ టెంపుల్ పార్కింగ్ ప్రాంతాలను కలిపితే సికింద్రాబాద్ స్టేషన్ పరిసరాల్లోనే మొత్తం 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా ప్రయాణికుల సౌకర్యాలతో పాటు పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ ప్రాజెక్టులోని ముఖ్యాంశంగా మారింది. భవిష్యత్‌లో పెరిగే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఛార్జింగ్ మౌలిక వసతులను ఏర్పాటు చేయడం ద్వారా స్టేషన్ ప్రాంతాన్ని ఈవీ ఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన తొలి విమానం.. ప్రయాణికులకు గిఫ్ట్‌లుసికింద్రాబాద్‌తో పాటు నగరంలోని ఇతర రైల్వే స్టేషన్లలోనూ ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను విస్తరిస్తున్నారు. హైటెక్ సిటీ, నెక్లెస్ రోడ్, ఫిరోజ్‌గూడ, సుచిత్ర సర్కిల్, నేరేడ్‌మెట్, హఫీజ్‌పేట్, బేగంపేట్, ఉమ్దానగర్, సీతాఫల్‌మండి స్టేషన్లలో కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దీంతో రైల్వే ప్రయాణికులు తమ ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జ్ చేసుకునే అవకాశాలు నగరవ్యాప్తంగా పెరుగుతున్నాయి. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పూర్తయిన తర్వాత రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున పార్కింగ్, వాహన ఛార్జింగ్, ప్రయాణికుల నిర్వహణ వంటి అంశాలకు ఇప్పటి నుంచే ప్రాధాన్యం ఇవ్వడం కీలకంగా మారింది. ప్రపంచస్థాయి ప్రయాణికుల సౌకర్యాలతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు అనుగుణంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# కొండాను బైబై...తప్పదా

వరంగల్, ఆగస్టు 24, కూతురు చేసిన వ్యాఖ్యలతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన పదవికి ఎసరు తెచ్చుకున్నారు. ఇప్పటికే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ క్లారిటీ ఇచ్చేశారు. గతంలో తాను సురేఖను కాపాడానని .. ఇప్పుడు ఆ అవకాశం లేదని క్లారిటీ ఇచ్చారు. పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే ఎవరికైనా సరే ఇటువంటి పరిణామాలు ఎదురవుతాయని పేర్కొన్నారు. అనిరుద్ రెడ్డి.. రాజగోపాల్ రెడ్డి పరోక్షంగా మాట్లాడారని.. వారు నేరుగా ముఖ్యమంత్రి మీద ఆరోపణలు చేయలేదని మహేష్ కుమార్ గౌడ్ క్లారిటీ ఇచ్చారుకొండా సురేఖ భర్త మురళి భట్టి విక్రమార్కను కలవడానికి ప్రయత్నించారు. అయితే విక్రమార్క ఆయనకు అవకాశం ఇవ్వలేదు. దీనికి తోడు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్.. ఇతర ఎమ్మెల్యేలు సురేఖ మీద తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవూరి ప్రకాష్ రెడ్డి అయితే ఏకంగా సురేఖ కూతుర్ని ఉద్దేశించి పిల్ల కాకి.. అని సంబోధించారు. ఈ ప్రకారం చూసుకుంటే కొండా సురేఖ పదవి ఊడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.కొండ సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలు ఏకంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి కావడం.. అది కూడా ఆమె తీవ్రస్థాయిలో ముఖ్యమంత్రి నెత్తికి కళ్ళు ఎక్కాయని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. సాధారణంగా ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అంత దారుణంగా విమర్శించకూడదు. అలా మాట్లాడితే పరిణామాలు వేరే విధంగా ఉంటాయి. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది కాబట్టి.. కొండా సురేఖ ఇంకా పదవిలో ఉండగలుగుతున్నారు. ఒకవేళ భారత రాష్ట్ర సమితి లేదా భారతీయ జనతా పార్టీలో అయితే పరిణామం వేరే విధంగా ఉండేదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.కొండా సురేఖ కుమార్తె మాట్లాడిన మాటలు కాంగ్రెస్ అధిష్టానం వరకు కూడా వెళ్లాయని.. ఈ సమయంలో సరైన క్రమశిక్షణ చర్యలు పాటించకపోతే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని ఇప్పటికే వేగులు అధిష్టానానికి చెప్పినట్టు తెలుస్తోంది. అందువల్లే మహేష్ కుమార్ గౌడ్ అధిష్టానం వైఖరిని తన మాటగా చెప్పారని.. సురేఖ పదవి కోల్పోవడం ఖాయమని తెలుస్తోంది.ఇటీవల కొండా సురేఖ మాజీ వ్యక్తిగత కార్యదర్శి సుమంత్ మీద ప్రభుత్వం కేసులు పెట్టింది. ఒక కాంట్రాక్టర్ విషయంలో సుమంత్ ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఇనుప రాడ్డుతో ఆయనను కొట్టారు. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు సుమంత్ మీద కేసు నమోదయింది. గతంలో సుమంత్ కోసం ఏకంగా సురేఖ కుమార్తె రంగంలోకి దిగింది. డబ్బుల వసూళ్లకు సంబంధించి సుమంత్ తమను ఇబ్బంది పడుతున్నారని సిమెంట్ కంపెనీల యజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో సుమంత్ ను విధుల నుంచి ప్రభుత్వం తొలగించింది. అతడిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తే హోండా సురేఖ కుమార్తె అడ్డుకుంది.అప్పట్లోనే సురేఖ కుమార్తె రచ్చ రచ్చ చేసింది. చివరికి అప్పట్లో ప్రభుత్వం ఉన్న కొంత మంది మీద ఆమె ఆరోపణలు చేసింది. వాస్తవానికి అప్పట్లోనే ఆమె పదవి పోతుందని ప్రచారం జరిగింది.. దానికంటే ముందు సినీ నటుడు నాగార్జున కుటుంబం మీద సురేఖ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. అప్పట్లో రేవంత్ ప్రభుత్వం ఆమెకు అండగా ఉంది. సురేఖ లేదా ఆమె కుమార్తె లేదా కొండా మురళి ప్రతిసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. పరిపాటిగా మారిపోవడంతో.. ఆమెను తప్పించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై క్లారిటీ రావాలంటే ఇంకా కొద్దిరోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

# తెలంగాణలో ఎయిర్‌పోర్టుకు నోటిఫికేషన్ జారీ

అదిలాబాద్, ఆగస్టు 24, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 2,069 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. తొలివిడతగా 160.32 ఎకరాలకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అర్లి-బి పరిధిలో 58 మంది రైతుల భూములు ఇందులో ఉన్నాయి. కచ్‌కంటి, టాక్లి ప్రాంతాల్లో మరికొంత భూమికి నోటిఫికేషన్ సిద్ధమవుతోంది. 60 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని అధికారులు సూచించారు.తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. వరంగల్ మామూనూరుతో పాటు రామగుండం, ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టును ప్రతిపాదించారు. ప్రస్తుతం వరంగల్ మామూనూరుతో పాటు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు నిర్మాణానికి సిద్ధమయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు మరో ముందడుగు పడింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం 2069 ఎకరాలను సేకరించాలని డిసైడ్ కాగా.. తొలివిడతలో 160.32 ఎకరాల భూసేకరణకు రెవెన్యూ శాఖ తాజాగా ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది.ఆదిలాబాద్ గ్రామీణ మండలం అర్లి-బి గ్రామ పరిధిలోని 58 మంది రైతుల నుంచి సేకరించనున్న భూమి వివరాలను తాజా నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. అదే మండలంలోని కచ్‌కంటి గ్రామ పరిధిలో 29.19 ఎకరాలతో పాటు టాక్లి గ్రామ శివారులోని మరో 5.20 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ రెడీ చేస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రావు వెల్లడించారు. నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి మరో 60 రోజుల్లో ఎవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలపాల్సి ఉంటుందని అన్నదాతలకు సూచించారు. త్వరలోనే గ్రామసభలు నిర్వహించి పరిహారం విషయంలో అభిప్రాయ సేకరణ చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ అనుమతి లేకుండా నోటిఫికేషన్‌లో పొందుపర్చిన భూములకు సంబంధించిన ఎలాంటి లావాదేవీలు, అభివృద్ధి, తాకట్టు వంటి పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు.కీలకమైన అనుకుంట, ఖానాపూర్ గ్రామ శివారులో సర్వే పూర్తి చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు ముందుగా మూతపడ్డ సీసీఐ భూములను సేకరిస్తారని ప్రచారం జరిగినా.. వాటి జోలికి వెళ్లడం లేదని అధికారులు చెప్పారు. దీంతో ఆ పరిశ్రమ తిరిగి తెరుచుకునే ఆశలు సజీవంగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఆదిలాబాద్ పట్టణం నుంచి అనుకుంట మీదుగా వెళ్లే ప్రధాన దారిని కచ్‌కంటి గుండా మళ్లిస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయా గ్రామస్థుల్లో కలవరం మె?దలైంది. తాజాగా బెంగళూరు నుంచి వచ్చిన ఇండియన్ కోస్ట్ గార్డ్ సర్వీసు విభాగ బృందం ఏరియల్ సర్వే చేయడం.. దాంతో పాటుగా భూసేకరణ ప్రక్రియ ఊపందుకోవడం ప్రతిపాదిత ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధిపై ఆదిలాబాద్ జిల్లావాసుల్లో ఆసక్తి నెలకొంది. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే అన్ని విధాలుగానూ ఆదిలాబాద్ అభివృద్ధి చెందనుంది.

# సెక్రటేరియట్‌లో సోలార్ కార్ పార్కింగ్..

## డిసెంబరులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 24, తెలంగాణ సెక్రటేరియట్‌లో రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్తర భాగంలో రెండు, దక్షిణంలో మూడు, పశ్చిమంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో 16 శాతం వరకు ఆదా చేయవచ్చని మంత్రి తెలిపారు. నార్కెట్‌పల్లి వంతెన పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ సెక్రటేరియట్‌లో విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణహిత మౌలిక వసతులను పెంచే దిశగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనుండగా.. ఈ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ ప్రాంగణంలోని కార్ పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్లతో కూడిన షెడ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఒకేసారి వాహనాల పార్కింగ్, విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు. సెక్రటేరియట్‌లో శనివారం ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. సోలార్ కారు పార్కింగ్, సీఆర్ఐఎఫ్ పనులు, వివిధ వంతెనల నిర్మాణ పురోగతిపై అధికారులతో చర్చించారు. సోలార్ పార్కింగ్ ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. సోలార్ పార్కింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్‌కు అవసరమైన విద్యుత్‌లో ఎక్కువ శాతం అక్కడే ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని మంత్రి వెల్లడించారు. ఫలితంగా సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం వరకు ఆదా అయ్యే ఛాన్సుందన్నారు. ప్రభుత్వ భవనాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచే చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.సెక్రటేరియట్ ఉత్తర భాగంలో రెండు వరుసలు, దక్షిణ భాగంలో మూడు వరుసలు, పశ్చిమ భాగంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో కూడిన కార్ పార్కింగ్ షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అందుకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పార్కింగ్ సదుపాయం మెరుగుపడటంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా నిర్మాణాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# ములుగు జిల్లాలో సుడిగాలి బీభత్సం?

## నేలకూలిన 118 భారీ వృక్షాలు

వరంగల్, ఆగస్టు 24, దట్టమైన అడవులకు ప్రసిద్ధి ములుగు జిల్లా. ఈ ప్రాంతంలో ప్రసిద్ధమైన సమ్మక్క సారలమ్మ.. బోగత జలపాతం.. గోదావరి నది ప్రవాహం.. ఇంకా అనేక రకాల ప్రకృతి ప్రసాదించిన వింతలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండడంతో జీవవైవిద్యం కూడా అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ ప్రకృతి రూపొందించిన అనేక వింతలు ఉన్నాయి. వాటిని చూసేందుకు ఏడాది పొడవునా పర్యాటకులు వస్తూనే ఉంటారు.దట్టమైన అడవులకు పేరుగాంచిన ములుగులో అసాధారణమైన విధ్వంసం కొనసాగుతోంది. ఇది పర్యావరణ శాస్త్రవేత్తలను.. స్థానికులను ఆందోళనకు గురిచేస్తుంది. ఇక్కడ వందల సంవత్సరాల నాటి మహావృక్షాలు కూడా క్షణాల్లో నేలమట్టమవుతున్నాయి. వరుసగా ఈ సంఘటనలు జరగడంతో అడవి స్వరూపం పూర్తిగా మారిపోతుంది. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఈ దారుణాలు రెండుసార్లు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో శాస్త్రీయ అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఆగస్టు 31న తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో రాకాసి గాలులు వీచాయి. ఈ ప్రమాదంలో దాదాపు విస్తారమైన వృక్షాలు నేల కూలిపోయాయి. ఈ నష్టం నుంచి ఇంకా తే రుకోక ముందే, గత ఏడాది జూలై 28న మంగపేట మండలం కోమటిపల్లి పరిధిలో అడవుల్లో పెను విధ్వంసం జరిగింది. కొద్ది నిమిషాల పాటు భారీగా గాలి వీచింది. ఈ ప్రమాదంలో పెద్ద పెద్ద వృక్షాలు నేల కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.ఇలా విధ్వంసం జరగడానికి టోర్నడో.. డౌన్ బర్స్ట్ కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒకేసారి భారీగా గాలివీస్తే దానిని టోర్నడో అంటారు. క్యుములోనింబస్ మేఘాల నుంచి చల్లటి గాలి ఒకసారిగా అత్యంత వేగంతో భూమిని తాకడం.. అది నాలుగు దిశల విస్తరిస్తే దానిని డౌన్ బర్స్ట్ అని పిలుస్తుంటారు. ఇటువంటి వాటివల్లే ములుగు జిల్లాలో ముఖ్యంగా అటవీ ప్రాంతంలో ఈ స్థాయిలో విధ్వంసం జరుగుతోందని విశ్లేషకులు అంటున్నారు. అయితే వీటిపై పూర్తిగా క్లారిటీ రావాలంటే శాస్త్రీయ అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలి వీచిన వేగం.. ప్రయాణించిన మార్గం.. నేల కూలిపోయిన వృక్షాల నమూనాలు.. డాప్లర్ రాడార్ సమాచారం వంటి ఆధారంగా వీటిని విశ్లేషించాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఈ తరహా విపత్తుల వల్ల సహజ ఆవాసాలు పూర్తిగా నాశనం అవుతాయని.. పర్యావరణం దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 528.58 చదరపు అడుగుల్లో ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్, ఆగస్టు 24, హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదల కోసం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్లకు నిర్మాణ అనుమతుల ప్రక్రియ ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ అనంతరం గృహ నిర్మాణ సంస్థ అధికారులు జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలకు దరఖాస్తులు సమర్పించారు. ఆయా భూముల పత్రాలను చీఫ్ సిటీ ప్లానర్లు పరిశీలిస్తున్నారు. క్యూర్ పరిధిలో 16 ప్రాంతాల్లో తొమ్మిది, పది అంతస్తుల టవర్లుగా 7,680 ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఫ్లాట్ కామన్ ఏరియాతో కలిపి 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో భూమిపూజ నిర్వహించడంతో నిర్మాణానికి సంబంధించిన తదుపరి కార్యాచరణ ప్రారంభమైంది. ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి అవసరమైన అనుమతుల కోసం గృహ నిర్మాణ సంస్థ అధికారులు జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ నగరపాలక సంస్థ, మల్కాజిగిరి నగరపాలక సంస్థలకు దరఖాస్తులు సమర్పించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూముల యాజమాన్య హక్కులు, పత్రాలు, నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించి అనుమతులు జారీ చేయాలని ఆయా కార్పొరేషన్ల కమిషనర్లు టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చీఫ్ సిటీ ప్లానర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత పత్రాల పరిశీలన ప్రారంభమైంది. టవర్ల రూపంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నందున ఒక్కో టవర్‌కు విడిగా నిర్మాణ అనుమతులు మంజూరు చేసే విధానాన్ని అధికారులు అనుసరించనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 10 ప్రాంతాల్లో 4,320 ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ పూర్తయింది. మరోవైపు సీఎంసీ పరిధిలోని నాలుగు, ఎంఎంసీ పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన దరఖాస్తులు కూడా సమర్పించినట్లు అధికారులు తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. భూముల అందుబాటు, నిర్మాణ అనుమతులు, సాంకేతిక పరిశీలనలు వంటి ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి పనులను దశలవారీగా ప్రారంభించనున్నారు. క్యూర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో మొత్తం 16 ప్రాంతాల్లో 7,680 ఇళ్లను ప్రభుత్వం నిర్మించనుంది. వీటిని తొమ్మిది, పది అంతస్తుల టవర్ల రూపంలో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూములను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో 480, మహేశ్వరం పరిధిలోని జల్‌పల్లిలో 480, ఖైరతాబాద్‌లో హకీంపేట్ దర్గా వద్ద 120, నాంపల్లిలోని రెడ్‌హిల్స్‌లో 360, అదే ప్రాంతంలోని నిలోఫర్ సమీపంలో 120, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ సమీపంలో 360, కార్వాన్‌లోని కుల్సుంపురలో 480, బహదూర్‌పురలోని నందిముస్లాయిగూడలో 480 ఇళ్లు నిర్మించనున్నారు. అలాగే సనత్‌నగర్ పాటిగడ్డలో 480, అంబర్‌పేట్ సిటీ పోలీస్ లైన్స్‌లో 480, మలక్‌పేట్ గడ్డిఅన్నారం ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌లో 480, శేరిలింగంపల్లి రాయదుర్గంలో 480, ఇబ్రహీంపట్నం బండ్లగూడ ఎల్‌ఐజీ కాలనీ వద్ద 480, మల్కాజిగిరి కౌకూర్‌లో 480, కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో 480, మేడ్చల్ పోచారం ఎల్‌ఐజీ కాలనీలో 480, గాజులరామారంలో 480, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలో 140 ఇళ్లను నిర్మించనున్నట్లు ప్రణాళికలో ఉంది. డిజైన్ల ప్రకారం ఒక్కో ఫ్లాట్ సాధారణ ప్రాంతాలను కలుపుకొని 528.58 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటుంది. బహుళ అంతస్తుల టవర్లలో నిర్మించనున్న ఈ ఇళ్లలో ప్రాథమిక సౌకర్యాలు, కామన్ ఏరియాలను కూడా ప్రణాళికలో భాగంగా చేర్చారు.

# హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు నాయుడు

ఏలూరు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరులో పర్యటించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి గార్మె పాప్ కార్న్‌కా నాన్-ఉఓూ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఫ్యాక్టరీని, పాప్ కార్న్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సంరద్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, పార్థసారధి, అచ్చెన్నాయుడు, గార్మె పాప్ కార్న్‌కా ఎండీ ఎస్‌బీపీ పట్టాభిరామారావు , అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాట్లాడుతూ రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోందని అన్నారు.

మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎం హైబ్రీడ్ మొక్క జొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలని అన్నారు.

యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్ పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. అలాగే స్థానికంగా తయారయ్యే కొండవీటి కొయ్య బొమ్మలు కూడా స్వదేశీ ఉత్పత్తులు. ప్రపంచానికి ఈ ఉత్పత్తులు వెళ్లాలి. కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మొక్క జోన్న, మిరప సహా ఆక్వా తదితర పంటలు ప్రపంచానికి చేరాలి. అయితే ప్రాసెస్ చేసి విలువ జోడించి బ్రాండ్తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రైతులంతా ఫుడ్ ప్రాసెసింగ్ వైపు ఆలోచన చేయాలని పిలుపు నిస్తున్నానని అన్నారు.

# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరు పెట్టాలి

మలక్‌పేట్ వాసులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకుల డిమాండ్‌సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ఫ్లోర్ లీడర్ స్వర్గీయ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరు పెట్టాలని మలక్‌పేట్ వాసులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆయన అభిమానులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల కోసం సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. “అన్నా అని పిలిస్తే ‘నేనున్నా’ అంటూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన మహానుభావుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి. ఆయన చేసిన సేవలకు గుర్తుగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు ఆయన పేరు పెట్టాలి” అని మలక్‌పేట్ వాసులు కోరారు.పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను భావితరాలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం తక్షణమే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరు పెట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నవ కంటోన్మెంట్ నిర్మాణం లో భాగంగా క్లీన్ కంటోన్మెంట్ మిషన్: బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ బోర్డు జనరల్ బాడీ సమావేశం ఈరోజు బోర్డు కార్యాలయంలో బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని కంటోన్మెంట్ అభివృద్ధికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తాను నియోజకవర్గంలో నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట చేపట్టి పలు సమస్యలను గుర్తించానని, ముఖ్యంగా బోర్డు పరిధిలోని అన్ని వార్డులలో ఎక్కడికక్కడ చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వెంటనే క్లీన్ కంటోన్మెంట్ లక్ష్యంగా మిషన్ చేపట్టాలని సూచించారు.బ్రిగేడియర్, సి ఇ ఓ, నామినేటెడ్ మెంబర్ లు కూడా ఎమ్మెల్యే సూచనతో ఏకీభవించి వెంటనే క్లీన్ కంటోన్మెంట్ మిషన్ చేపడదామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి జఖఊఅ ల నిర్మాణానికి 6 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, రెండు చోట్ల ఔఅ లు కూడా బోర్డు మంజూరు చేసిందని, మిగిలిన వాటికి కూడా ఔఅ లను త్వరగా ఇస్తే వాటి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా సమకూరిన 303 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూములకు మరో 35 కోట్ల రూపాయలను ఇస్తుందని వాటితో నియోజకవర్గంలో నాలాలు, డ్రైనేజీలను అభివృద్ధి చేసి కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని బోర్డు సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో సి ఇ ఓ అరవింద్ కుమార్ ద్వివేది, నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

## మందుబాబుల ఘర్షణ ఒకరికి గాయాలు

మచిలీపట్నం చిలకలపూడి రైల్వే గేట్ సమీపంలో ఉన్న బార్ లో మందు బాబులు వీరంగం సృష్టంచారు. ఇద్దరు వ్యక్తుఉ ఒకరి పై ఒకరు దాడి చేసుకున్నారు. కనుముడి నాగరాజు అనే వ్యక్తి పై వేముల మహేష్ దాడి చేసాడు. గాయాపడిన నాగరాజును మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి నుండి విజయవాడ ఆసుపత్రి కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గన్నవరంలో ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడే ప్రసాద్, వర్ల కుమార్ రాజా, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గోన్నారు. తరువాత ఉప రాష్ట్రపతి గన్నవరం నుంచి నూజివీడు నియోజకవర్గం ముసునూరు బయలుదేరారు.

## తీజ్ ఉత్సవాలలో పాల్గొన్న డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్

డోర్నకల్ నరసింహుల పేట మండలం గ్యామ తండా, బస్తారం తండా పలు గ్రామపంచాయతీలో అంగరంగ వైభవంగా జరుగుతున్న బంజారాల తీజ్ పండుగలో పాల్గొన్న అనిల్ నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల సంస్కృతి సంప్రదాయాలను నిలువెత్తు నిదర్శనం తీజ్ పండుగ ఈ పండుగని తొమ్మిది రోజులు ఆకుకూరలు తింటూ నిష్టతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవడంతోపాటు పాడిపంటలు సమృద్ధిగా పండి సుఖ సంతోషాలతో కలిసిమెలిసి ఐక్యతకు నిదర్శనంగా తీజ్ పండుగ నిలుస్తుంది అని అనిల్ నాయక్ చెప్పారు.

## పెద్దపల్లిలోఎన్ఐఏ సోదాలు

పెద్దపల్లి రామగుండం, అయోధ్యనగర్లో అనుమానిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయనే అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఓ ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనుమానితుడిని అధికారులు విచారించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం ఎన్ఐఏ బృందానికి స్థానిక పోలీసులు సహకరించారు.. తదుపరి వివరాలు తెలియాల్సి ఉంది.

# కేంద్రం ముందు మోకరిల్లి స్మార్ట్ మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్

**స్మార్ట్ మీటర్ల ద్వారా ఫ్రీ కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఫ్రీ కరెంట్ ఎత్తివేసే కుట్ర**

**ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లు పెడితే ఊరుకునేది లేదు**

**ప్రభుత్వాన్ని హెచ్చరించిన**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్ కేంద్రం తెచ్చిన కొత్త పథకంపై సంతకం పెట్టి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అరోపించారు. గతంలో రైతులను ఇబ్బంది పెట్టేలా చేసిన నల్ల చట్టాల్లో భాగంగా తేవాలనుకున్న స్మార్ట్ మీటర్లను మళ్లీ తేవాలని కేంద్రం చేస్తున్న కుట్రలకు రేవంత్ సర్కార్ మోకరిల్లింది. అదానీ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు, ప్రజలకు నష్టం చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లను తెస్తున్నారని అన్నారు.దీనికి సంబంధించి ప్రజల మైండ్ వాష్ చేసేందుకు ఇటీవలే నెక్లెస్ రోడ్ లో డెమో కార్యక్రమం పెట్టారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ సీఎండీ కూడా స్మార్ట్ మీటర్లు తెస్తున్నామని చెప్పారు. గతంలో మనం ఈఆర్సీలో గొడవ చేస్తే రైతుల బావికాడ మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పారు . కానీ ఇప్పుడు ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పుడున్నవన్నీ కూడా స్మార్ట్ మీటర్లే. కానీ కొత్తగా తేనున్న స్మార్ట్ మీటర్ల ద్వారా చాలా నష్టం ఉంటుంది. ఈ మీటర్ల పెడితే మనం ముందే ఫోన్ లో రీఛార్జ్ చేసుకున్నట్లు ప్రీ పెయిడ్ రీఛార్జ్ చేసుకోవాలి. దీని ద్వారా మనకు ఎప్పుడు రీఛార్జ్ అయిపోతే అప్పుడు కరెంట్ పోతుందని అన్నారు.

యూపీలో ఇదే విధంగా మీటర్లు పెడితే ఆ మీటర్లను తీసి ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ ఆఫీస్ లలో ప్రజలు వేసి వెళ్తున్నారు. పైగా స్మార్ట్ మీటర్ల కారణంగా ప్రభుత్వం ఇస్తామన్న 2 వందల యూనిట్ల ఫ్రీ కరెంట్ ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. సెలూన్లకు ఇచ్చే ఫ్రీ కరెంట్ కు కూడా ఇబ్బంది అవుతుంది. రేవంత్ రెడ్డి సర్కార్ కేంద్రం ముందు మోకరిల్లి తెలంగాణ ప్రజలకు నష్టం చేసే పనిచేస్తుంది. స్మార్ట్ మీటర్ల కారణంగా ఫ్రీ కరెంట్, సెలూన్లకు ఇచ్చే కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే సబ్సిడీ కరెంట్ ను ఎత్తివేసే ప్రమాదం ఉంది. కనుక ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రక్షణ సేన ఇందుకు ఒప్పుకోదని హెచ్చరిస్తున్నాం. ముందు ఇప్పుడున్న మీటర్ల ద్వారానే 24 గంటల కరెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. ఆటిజన్లు, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగా ఉండేలా చూడాలి. ఎప్పుడు ప్రజల జేబులకు చిల్లు పెట్టే కార్యక్రమం కాకుండా వారికి మేలు చేసే పనిచేయాలి. స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవ స్వామి దేశాయ్

నందవరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు శాసనసభ్యులు గౌరవనీయులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు నందవరం గ్రామ అధ్యక్షులు దేవల భీమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో నందవరం మండలం నందవరం గ్రామ లో బిసి కాలనీ లో 35 బూత్ లో ఇంచార్జీ మోహన్ ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ,కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి,ప్రజలకు అందించిన సంక్షేమ ఫలితాలను వివరించారు.ఈ సందర్భంలో గ్రామంలో ఒక హోటల్లో జరిగిన సంఘటన గతంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆ హోటల్ కి రావడంతో టిఫిన్ చేసినాడు అని గతంలో ప్రభుత్వం మాకు కులాయి కేటాయించలేదు అని ఆ హోటల్ యజమాని వాళ్ళు తెలియజేయడం జరిగింది

# నకిలీ వస్తువులతో ముంచుకొస్తున్న ప్రమాదం

## (హెచ్.ప్రతాప్)

హైదరాబాద్‌లో నకిలీ ఉత్పత్తుల విస్తరణ ఇక బ్రాండ్ల ఆదాయానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. అది వినియోగదారుల భద్రత, ప్రజారోగ్యం, మార్కెట్ విశ్వసనీయతకు సంబంధించిన తీవ్రమైన సవాలు. ఆథెంటికేషన్ సొల్యూషన్ ప్రొవైడర్స్ అసోసియేషన్ , క్రిసిల్ ఇంటెలిజెన్స్ సంయుక్తంగా రూపొందించిన స్టేట్ ఆఫ్ కౌంటర్‌ఫీటింగ్ ఇన్ ఇండియా 2025 నివేదిక దేశంలోని నకిలీ వస్తువుల వ్యాప్తిపై ఆందోళనకరమైన చిత్రాన్ని ఆవిష్కరించింది. తొమ్మిది నగరాల్లో 1,639 మంది వినియోగదారులతో నిర్వహించిన సర్వేలో దాదాపు 35 శాతం మంది గత ఏడాది నకిలీ ఉత్పత్తులను ఎదుర్కొన్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌కు సంబంధించిన గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. గత 12 నెలల్లో 46 శాతం మంది హైదరాబాదీలు నకిలీ ఉత్పత్తులను ఎదుర్కొన్నట్లు నివేదిక వెల్లడించడం సమస్య తీవ్రతను సూచిస్తోంది. దక్షిణ భారతదేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే ఇది గణనీయమైన స్థాయి. అంతేకాదు, దేశవ్యాప్తంగా 89 శాతం మంది పట్టణ వినియోగదారులు తమ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా నకిలీ ఉత్పత్తిని కొనుగోలు చేసినట్లు సర్వే పేర్కొంది.

నకిలీ దుస్తులు వినియోగదారుడి డబ్బును మాత్రమే నష్టపరచవచ్చు. కానీ నకిలీ మందులు ప్రాణాలను, నకిలీ ఆటో విడిభాగాలు భద్రతను, నకిలీ వ్యవసాయ ఉత్పత్తులు రైతుల జీవనాధారాన్ని ప్రమాదంలోకి నెట్టవచ్చు. అందువల్ల దీన్ని మేధో సంపత్తి హక్కుల ఉల్లంఘనగా మాత్రమే చూడటం పొరపాటు. ఇది వినియోగదారుల హక్కులు, ప్రజారోగ్యం, పన్ను ఆదాయం, న్యాయబద్ధమైన వ్యాపారానికి సంబంధించిన సమస్య.

డిజిటల్ వాణిజ్యం విస్తరించడంతో సమస్యకు కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. ఆన్‌లైన్ వేదికల ద్వారా నకిలీ ఉత్పత్తుల విక్రయాన్ని అరికట్టడం ఇప్పుడు కీలకం. అదే సమయంలో స్థానిక మార్కెట్లను కూడా విస్మరించలేం. అంటే నకిలీ వ్యాపారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ తన వల విస్తరించింది.

ప్రభుత్వం మొదట నకిలీ ఉత్పత్తులను కేవలం మార్కెట్ ఉల్లంఘనగా కాకుండా వినియోగదారుల భద్రతకు సంబంధించిన తీవ్రమైన నేరంగా పరిగణించాలి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేసి పోలీసు, పన్ను, ఔషధ నియంత్రణ, ఆహార భద్రత, వ్యవసాయ, వినియోగదారుల వ్యవహారాల శాఖలను అనుసంధానించాలి. అధిక ప్రమాదం ఉన్న మందులు, వ్యవసాయ రసాయనాలు, ఆటో విడిభాగాలు వంటి రంగాల్లో తయారీ నుంచి విక్రయం వరకు గుర్తింపు, సరఫరా–గమనిక, ధృవీకరణ వ్యవస్థలను తప్పనిసరి చేయాలి. ఆన్‌లైన్ వేదికలకు విక్రేతల ధృవీకరణ, అనుమానాస్పద వస్తువులపై వేగవంతమైన తొలగింపు, ఫిర్యాదుల పరిష్కారానికి స్పష్టమైన బాధ్యతలు విధించాలి. నకిలీ ఉత్పత్తులపై రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, ప్రత్యేక తనిఖీలు, వేగవంతమైన దర్యాప్తు, కఠినమైన శిక్షలు కూడా అవసరం. సురక్షిత ప్యాకేజింగ్, ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు, డిజిటల్ ధృవీకరణ, సరఫరా–గమనిక వంటి సాంకేతికతలను విస్తరించాల్సిన అవసరాన్ని పరిశ్రమ వర్గాలు కూడా స్పష్టం చేస్తున్నాయి.

ఇక్కడ అసలు లోపం "వినియోగదారుడే జాగ్రత్తగా ఉండాలి" అనే దృక్పథంలో ఉంది. ఒక సాధారణ వ్యక్తి ప్యాకేజింగ్, ముద్ర లేదా బార్‌కోడ్ చూసి నకిలీని నిర్ధారించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. నిజమైన వస్తువును గుర్తించే బాధ్యతలో సాంకేతిక సహాయం, ప్రభుత్వ నియంత్రణ, తయారీదారుల పారదర్శకత ఉండాలి.

"అసలైనదే కొనండి" అని చెప్పడం సరిపోదు; అసలైనదాన్ని క్షణాల్లో గుర్తించగలిగే వ్యవస్థను నిర్మించాలి. నకిలీ వస్తువులపై పోరాటం బ్రాండ్ల పరిరక్షణ కోసం మాత్రమే కాదు---ప్రజల డబ్బు, ఆరోగ్యం, ప్రాణాలు, మార్కెట్‌పై నమ్మకాన్ని కాపాడటానికి.

# ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి



హైదరాబాద్ ఆగస్ట్ 24 ; విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు ?15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కారణంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తుపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.

రామచందర్ రావు నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరాహార దీక్షలో బిజెపి మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ ప్రభా గౌడ్ పాల్గొని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచందర్ రావు గారు, మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ రఘునందన్ రావు గారు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు, శ్రీమతి డి.కే. అరుణ గారు, శ్రీ పాయల్ శంకర్ గారు, శ్రీ రాకేష్ రెడ్డి గారు, శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

అలాగే బీజేపీ యువమోర్చా నాయకులు, మహిళా మోర్చా నాయకులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 24:**ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 75 దరఖాస్తులు అందాయన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# వర్షాల వేళ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి..

## ఇంటి ముందు నీరు నిలవకుండా చేయండి ..

## మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:**ఖమ్మం జిల్లాలో వచ్చే 7 రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే



అవకాశం ఉందిని తెలంగాణ ప్రజా ఆరోగ్య శాఖ తెలిపిందని కావున వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలందరూ అప్రమతతో ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. వర్షాలతో దోమల బెడద పెరిగే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కిటికీలు, తలుపులకుదోమతెరలుఏర్పాటుచేసుకోవాలిఅని మలేరియాడెంగ్యూ, చికున్‌గున్యా నివారణకు ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించి నిల్వ నీటిని తొలగించాలని డాక్టర్ చంద్రకళ సూచించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించేందుకు కాచి చల్లార్చిన లేదా ఫిల్టర్ చేసిన నీటినే తాగాలి.భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. వైరల్ జ్వరాలు, ఇన్ఫ్లుయెంజా లక్షణాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని . అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేయాలి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పడకలు, ఐవీ ద్రవాలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచారని ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి ని ఆమె తెలిపారు.

# అల్పాహారం తిన్న 13 మంది విద్యార్థులకు అస్వస్థత

## సమగ్ర విచారణ జరపాలని తల్లిదండ్రులు డిమాండ్.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న అల్పాహార పథకంలో భాగంగా అందించిన ఆహారం తిన్న 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మర్లపాడులో చోటుచేసుకుంది.

మర్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత





పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అల్పాహారం అందించారు. అల్పాహారం తిన్న కొద్దిసేపటికే పలువురు విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి తదితర అనారోగ్య లక్షణాలు కనిపించడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. అస్వస్థతకు గురైన 13 మంది విద్యార్థులను వెంటనే వేంసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థులకు చికిత్స కొనసాగుతోంది. అయితే అల్పాహారం తిన్న తర్వాతే విద్యార్థులు ఒకేసారి అనారోగ్యానికి గురికావడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పాహారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థులకు అస్వస్థత వచ్చి ఉండొచ్చని వారు ఆరోపిస్తున్నారు.

ఘటనపై అధికారులు స్పందించి అల్పాహారం నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు, విద్యార్థులు అస్వస్థతకు గురైన కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆహారం తయారీ, నిల్వ, పంపిణీ సమయంలో పాటించిన పరిశుభ్రత ప్రమాణాలను కూడా పరిశీలించాలని కోరుతున్నారు.విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో అధికారులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోవాలని కోరారు, ఆహారంలో లోపం ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# పెద్ద బ్రహ్మం దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సండ్రాలి

## కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బిఆర్ఎస్ నాయకులు.




**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:**తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో తురక పెద్ద బ్రహ్మం దశదిన కార్యక్రమం సోమవారం వారి స్వగ్రామం అన్నారుగూడెంలో జరిగింది.ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ ఎమ్మెల్యే సండ్రా వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సండ్ర తురక పెద్ద బ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.పెద్ద బ్రహ్మం గ్రామానికి చేసిన సేవలను సండ్రా వెంకట వీరయ్య గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట తల్లాడ మాజీ ఎంపీపీ,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్డ శ్రీనివాసరావు,ఆ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహనరెడ్డి,అన్నారు గూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఆ పార్టీ జోనల్ సభ్యులు దిరిశాల దాసురావు, తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,గోపాలపేట ఉప సర్పంచ్ శనక్కాల సత్యనారాయణ, నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు,నున్న చిన్న తిరుమలరావు, జివిఆర్,నరసింహారావు,శ్రీనివాసరావు గ్రామ పెద్దలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 మొక్కలను నాటాలి

## కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట ప్రజాబలం ప్రతనిధి:** సిద్దిపేట నేడు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 1000 మొక్కలను నాటాలని కలెక్టర్ కె. హైమావతి అధికారుల ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షం కురుస్తుందని మరో రెండు, మూడు రోజులు కంటిన్యూగా వర్షం పడే అవకాశం ఉన్నందున మొక్కలు నాటడానికి ఇది సరైన సమయమని అన్నారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 17 లక్షల 68 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మొక్కలు నాటడానికి 2 లక్షల పైగా గుంతలు త్రవ్వి సిద్ధంగా ఉంచడం జరిగిందని, మిగతా గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ లతోపాటు అని మున్సిపాలిటీలలో నిర్దేశిత మీద మొక్కలు నాటాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ భూములలో మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులను, ప్రజలను ఇన్వాల్వ్ చేస్తూ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటాలని, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరిగే అవకాశం ఉన్నందనీ అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో రేపు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల 780 మంది టీబీ పేషెంట్స్ మెడిసిన్స్ వాడడంపై వైద్య శాఖ అధికారులతో రివ్యూ చేయాలని అన్నారు. సెన్సెస్ 2027 కు సంబంధించి వివిధ శాఖలకు ప్రొఫార్మా అందించడం జరిగిందని ఆ ప్రొఫార్మర్ ప్రకారం వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మెగా ప్లాంటేషన్ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజా స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

## 11వ వార్డులో నిర్మాణాలపై విచారణ జరపాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్

**వేములవాడ, ఆగస్టు 24 (ప్రజాబలం):** పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని సర్వే నంబర్లు 1389, 1390, 1391లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణిలో ఎంపీడీవో (అర్బన్)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ, సదరు సర్వే నంబర్ల పరిధిలో నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, లేఅవుట్ రికార్డులు, భూమి వినియోగంపై రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని పార్కు, ఓపెన్ జిమ్, గ్రంథాలయం వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రాల ప్రతులను కూడా తాజా వినతిపత్రానికి జత చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, కార్యదర్శి జి. గోపాల్, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, తిప్పర్తి సాయి కృష్ణ పాల్గొన్నారు.




# 20 వ వార్డ్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం.

## కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వ వార్డ్ శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ అల్పాహారం కార్యక్రమం అనేది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద,బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కు పుస్తకాలు,యూనిఫామ్,మధ్యాన్నం భోజనం తో పాటుగా ఇప్పుడు అల్పాహారం కూడా అందిచడం హర్షించదగిన విషయంఅనికొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపు కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నోపథకాలనుఅమలుచేస్తుందన్నారు. విద్యార్థుల కొరకు ప్రభుత్వ తీసుకొచ్చిన ఈ పథకాల పట్ల విద్యార్థుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ రామకృష్ణ రెడ్డి,కరుణ, వార్డ్ కాంగ్రెస్ నాయకులూ వంకడోత్ బిక్యా,ఎస్ కే రహీం (పండు), తేజావత్ నగేశ్వరరావు,గుగులోత్ ఉపేందర్,కొర్ర వెంకటేశ్వర్లు, ఎస్ కే హర్షత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం..

## డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి

హైదరాబాద్ హైదరాబాద్ డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్, దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారం. ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళ్లు నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు.

# పుట్టు పంచల కార్యక్రమంలో చిన్నారులను ఆశీర్వదించిన పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 24(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్ సదాశివపేట్ ఈకో వ్యాల్యూ వెంచర్ సంఘున్న మనవడు మనవరాలు పుట్టు పంచల కార్యక్రమంలో పాల్గొన్నపట్లూర్ మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్ చిన్నారి అన్నా చెల్లెలకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించి నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విద్యాబుద్ధులతో జ్ఞాన సంపన్నులై తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు రక్తసంబంధీకులకు మధురమైన ప్రేమ గలవారై నిండు నూరేళ్లు చల్లగా దేవుడు ఆశీర్వదించ లనీ పట్లూర్ మాజీ సర్పంచ్ దేవరదీసి ఇందిరా అశోక్ తెలిపారు

# ఒకే కుటుంబంలో నలుగురి మృతి.. బాధితులకు అండగా ఉంటాం ప్రభుత్వ విప్ ఆది

## అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం: ఎస్పీ



**వేములవాడ (ప్రజాబలం ప్రతినిధి) ఆగస్టు 24:** చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తీవ్ర విషాదకరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి పరామర్శించి, మృతదేహాలకు నివాళులర్పించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని విప్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ ప్రమాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణంగా ప్రాథమికంగా గుర్తించామని, మద్యం సేవించి డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాంగ్ రూట్, మైనర్ డ్రైవింగ్ వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 12 శాతం తగ్గాయని తెలిపారు.

# ఆలయాల్లో అక్రమ వసూళ్లకు చెక్.. భక్తుల భద్రతపై అధికారుల ప్రత్యేక దృష్టి

## ఈవో, డీఈవో ప్రత్యేకతనిఖీలు



**వేములవాడ, ఆగస్టు 24:** శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాల్లో ఈవో ఎల్. రమాదేవి, డీఈవో నవీన్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో క్యూలైన్లు, సీసీ రోడ్ల వద్ద షెడ్లు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను పరిశీలించిన ఈవో.. ఎగ్జిట్ ద్వారం నుంచి ఎవరినీ లోపలికి అనుమతించకుండా, నిర్ణీత మార్గంలోనే భక్తులను పంపించాలని హోంగార్డు, ఎస్పీఎఫ్ సిబ్బందిని ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల నుంచి ఎవరైనా అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయ పరిసరాలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయని తెలిపారు.

అలాగే భక్తులు సమర్పించిన ఓడి బియ్యం నిల్వలను పరిశీలించారు. దర్శన సమయంలో అస్వస్థతకు గురైన ఓ మహిళా భక్తురాలికి ఈవో స్వయంగా తాగునీరు, అరటిపండ్లు అందించి పరామర్శించారు. అనంతరం ప్రత్యేకంగా అమ్మవారి దర్శనం చేయించారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈవో రమాదేవి, డీఈవో నవీన్‌కుమార్ క్యూలైన్లు, డొనేషన్ కౌంటర్లు, కోడె మొక్కుల విభాగాన్ని పరిశీలించారు. రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎగ్జిట్ మార్గం ద్వారా ఇతరులను లోపలికి అనుమతించవద్దని సిబ్బందికి ఆదేశించారు. కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంతో పాటు ఆలయ ప్రాంగణంలో భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఈవోలు జయకుమారి, లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, జూనియర్ అసిస్టెంట్ లింగయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ వివరాలను ఈవో ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు పీఆర్ఓ పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి షఫీని సన్మానించిన తల్లాడ జర్నలిస్టులు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 24 ప్రజాబలం:** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థి షేక్. షఫీని తల్లాడ జర్నలిస్టులు సోమవారం సన్మానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో ఆయన విస్తృతంగా ప్రచారం చేపడుతూ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లాడకు వచ్చిన ఆయనను తల్లాడ పాత్రికేయులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఎండి బహుదూర్, గుడిపల్లి నారాయణ, షేక్ మేహరాజ్, ఇజ్రాయిల్, తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో చిక్కుముడులు వేస్తూ, ఫారంలు అందజేయకుండా ! ఓటు హక్కుకు భంగం కలిగిస్తారా !!



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 24 ఆగస్టు 2026**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సమయంలో తల్లిదండ్రుల వివరాలు పొందుపరిచి మ్యాపింగ్ చేసిన వారికి కూడా కొంత మందికి నోటీసులు జారీ చేసి అందులో తాతల వివరాలు అడగడం వింతగా గోచరిస్తుంది, అంతే కాకుండా పాస్పోర్టు, 10వ తరగతి చదువుకున్న సర్టిఫికేట్ జత పరచమని కోరుతూ కేవలం 5 రోజులలో జవాబు ఇవ్వాలని కోరుతున్నారు. భారత దేశంలో పుట్టి పెరిగిన మధ్య తరగతి ప్రజలు చదువుకోకుండా, పాస్పోర్టు లేకుండా, సగటు జీవితం గడుపుతున్న వారు ఇచ్చిన కొద్ది రోజుల సమయంలోనే సమాచారం ఇవ్వని యెడల ఓటు హక్కును కోల్పోవలసి ఉంటుందా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇట్టి నిబంధనలను సడలించి ప్రజా సౌకర్యార్థం సరళీకరణ చేయాలని భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తున్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో ఆక్షేపణలు, అభ్యంతరాలు, దిద్దుబాటులు ఆగష్టు 17 మొదలు సెప్టెంబర్ 16 వరకూ ఉండగా వారం రోజుల గడువు గడిచినను అధికారుల పాత్ర, నిర్లక్ష్య ధోరణి వలన ఫారం 6 భౌతికముగా అందుబాటులో లేకపోవడంతో 18 సంవత్సరంలు నిండిన యువత భౌతికంగా ఫారం 6 పూరించి తమ ఓటు హక్కును పొందలేక పోతోన్నారని, అట్లాగే అనివార్య కారణాల వలన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో అందుబాటులో లేని ప్రజలు ఫారం 6 చిక్కక ఓటు హక్కును పొందలేక పోతున్నారని అందుకు అధికారుల నిర్లక్ష్య ధోరణియే కారణమనీ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అదేవిధంగా ఓటర్ లిస్టో ఉన్న లోటు పాట్లను సరి చేసుకోవడానికి, ఎక్కడో ఉన్న ఓటు హక్కును ఇక్కడకి మార్చుకోవడానికి ఫారం 8 అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, నిరాశ నిస్పృహలకు గురౌతున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన అనంతరం కూడా కొంత మంది పేర్లు రెండు నియోజక వర్గాల్లో ఉన్నవని పసిగట్టడం జరిగిన దరిమిలా ఇట్టి ద్వంద పేర్ల నమోదును తొలగించడానికి ఫారం 7 భౌతికంగా అందుబాటులో లేకపోవడంతో సవరణ చేయలేక పోతున్నామని అందుకు సంబంధిత అధికారులు స్పందించి ప్రజా సౌకర్యార్థం వెంటనే ఫారం 6, 7, 8 భౌతికంగా అందుబాటులోకి తేవాలని ప్రజాసంక్షేమం, హక్కుల సాధన కొరకు భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి. జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 24 కలెక్టరేట్** సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసి) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు,


జిల్లా అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి : రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 24 కలెక్టరేట్**సోమవారం, వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, డిఎఫ్ఓ వికాస్ మీనా తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి, కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు.

అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## జిజ్ఞాసరాష్ట్రస్థాయి ప్రదర్శన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 24 ఏటూరు నాగారం** ఏటూరునాగారం మండలంలోని స్థానిక డిగ్రీ కాలేజీలో నుంచి విద్యార్థులు ఈనెల 19,20 వ తేదీల లో హైదరాబాద్ లో జరిగిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ ప్రదర్శనపోటీలలో పాల్గొని ప్రదర్శన ఇచ్చి వచ్చిన చరిత్ర, తెలుగు, కంప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులకు సిసిఈ అధికారుల చేతుల మీదుగా పొందిన ప్రశంస పత్రాలను కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్, బి. రేణుక చేతుల మీదుగా అందించటం జరిగింది . తదనంతరం ఈ పోటీలలో పాల్గొని ప్రశంస పత్రాలు పొందిన విద్యార్థులను మరియు ఆయా విషయాల విభాగ అధిపతులను ప్రిన్సిపల్ తో సహా అధ్యాపకులు అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిజ్ఞాస కోఆర్డినేటర్ పి. జీవవేణి, చరిత్ర విభాగ అధిపతి సిహెచ్. వెంకటయ్య, తెలుగు విభాగ అధిపతి కె .సంపత్, కంప్యూటర్ విభాగ అధిపతి ఎమ్ .శ్రీధర్ మరియు అధ్యాపక బృందం డాక్టర్ ,డి. నవీన్, డాక్టర్ ,పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, రమేష్, రాజశేఖర్, భావన, భారతి, భాస్కర్, శ్రీకాంత్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు .

### ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ మంత్రి దామోదర్ రాజనర్సింహ .








**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పర్యటన,ఈపర్యటనలో నారాయణఖేడ్ పట్టణంలో ఆధునికంగా ఏర్పాటుచేసిన బాలాజీ అనురాధ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్థానిక ఎంపీ సురేష్ షెట్కర్, శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి,గార్లతో కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్నివిభాగాలను మంత్రిపరిశీలించారు.నారాయణఖేడ్,ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన ఆసుపత్రి నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు, జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలకు సేవలు అందుబాటులోఉండేలాప్రభుత్వ ఆసుపత్రులను, ప్రజావైద్య,ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామన్నారు, ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న సేవలకు ప్రజల్లో ఆదరణపెరుగుతుందన్నారు,ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ హరిణి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## SIR నోటీసుల పంపిణీపై అధికారుల సమావేశం





**జహీరాబాద్, ఆగస్టు 24 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ా×= నోటీసుల పంపిణీ ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, తహసీల్దార్ దశరథ్ ఆధ్వర్యంలో సోమవారం సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో SIR నోటీసుల పంపిణీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందికి వివరించారు. అర్హులైన ప్రతి ఓటరుకు నోటీసులు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# మంత్రి కృషితో 8 ఏండ్ల నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 24 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :టేక్మాల్ మండలం చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సీఎం తండాలో గత 8 సంవత్సరాలుగా నీటి సరఫరా మోటార్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆధారపడి విద్యుత్ కనెక్షన్లు తీసుకోవడం, తరచూ విద్యుత్ కనెక్షన్లు తొలగిపోవడం వల్ల, తండాలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను



సర్పంచ్ రాత్లా దేవ్లీ, గ్రామ పెద్దలు రామావత్ అనిల్ మాజీ సర్పంచులు , రాత్లా లక్ష్మణ్, రాత్లా గోపాల్, తదితరులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి దామోదర్ రాజనరసింహ తండా ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు (25, కె వి ఏ ) నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. మంత్రి ప్రత్యేక చొరవతో 23-08-2026, నిన్న ఆదివారం నాడుతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి,విద్యుత్ కనెక్షన్ పనులను కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో వేగంగా చేపట్టారు, దీంతో గత 8, సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యకు పరిష్కారం లభించడంతో తండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం జిల్లా కన్వీనర్‌గా ఎ. రాంబాబు

### జిల్లా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా.



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :జోగిపేట,తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘాన్ని మరింత బలోపేతం చేసి, జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. సికింద్రాబాద్ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.

సంఘం వ్యవస్థాపకులు నీలకంఠం ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం పాల్గొంది. ఈ సందర్భంగా సంఘాన్ని జిల్లాల వారీగా విస్తరించే క్రమంలో వివిధ జిల్లాలకు కన్వీనర్లను ఏకగ్రీవంగా నియమించారు.అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా జోగిపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎ. రాంబాబు ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తన శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులను సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. త్వరలోనే సంగారెడ్డి జిల్లాకు తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని రాంబాబు వెల్లడించారు.జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులందరినీ సంఘం పరిధిలోకి తీసుకువచ్చి, వారి సమస్యలపై సమిష్టిగా పోరాడేందుకు కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

# మండల ప్రజావాణికి 15 దరఖాస్తులు

**జహీరాబాద్, ఆగస్టు 24 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 15 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మహేందర్‌రెడ్డి తెలిపారు. వీటిలో ఒక దరఖాస్తు పింఛన్‌కు సంబంధించినది కాగా, 13 దరఖాస్తులు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించినవిగా ఉన్నాయి. మరో దరఖాస్తు రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యపై అందినట్లు ఎంపీడీవో వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## ప్రజా ఉద్యమాల యోధుడు మల్లారెడ్డి




**జహీరాబాద్, ఆగస్టు 24 ప్రజాబలం ప్రతినిధి:** పేదలు, రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ కార్యదర్శి బి. రాంచందర్ అన్నారు. సోమవారం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన మల్లారెడ్డి సేవలను స్మరించుకున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి అనేక ఒత్తిళ్లు, కేసులు ఎదురైనా ఉద్యమాన్ని వీడకుండా కొనసాగించారని రాంచందర్ తెలిపారు. తిమ్మంపేటలో పార్టీ నిర్మాణంతో పాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో భూ సమస్యలు, నిమ్జ్ భూ బాధితులు, రైతుల హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో మల్లారెడ్డి కీలకంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరనిలోటని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి



హైదరాబాద్ ఆగస్ట్ 24 ; విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు రెండు రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు ?15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కారణంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తుపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.

రామచందర్ రావు నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరాహార దీక్షలో బిజెపి మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ ప్రభా గౌడ్ పాల్గొని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచందర్ రావు గారు, మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ రఘునందన్ రావు గారు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు, శ్రీమతి డి.కే. అరుణ గారు, శ్రీ పాయల్ శంకర్ గారు, శ్రీ రాకేష్ రెడ్డి గారు, శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

అలాగే బీజేపీ యువమోర్చా నాయకులు, మహిళా మోర్చా నాయకులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మర్పల్లి ఎం ఆర్ పిఎస్ మండల కమిటీ మర్యాదపూర్వకంగా ఎమ్మార్వో ను ఘనంగాశాలువాతో సన్మానం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 24(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంఎం ఆర్ పి ఎస్ మర్పల్లి మండల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో మర్పల్లి మండల్ ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు బక్క నవీన్ మాదిగ ఉపాధ్యక్షులు ఆనంద్ మాదిగ యం.దేవదానం మాదిగ కార్యదర్శి మనోజ్ మాదిగ మరియు మర్పల్లి మండల్ ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు బైండ్ల.శ్రీనివాస్ మాదిగ బక్క శ్రీనివాస్ మాదిగ జగన్ మాదిగ పి సుధాకర్ మాదిగ ఇతర ఎమ్మార్పీఎస్ నాయకులు అందరూ కలసి ఘనంగా సన్మానించి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది అని తెలిపారు

## జహీరాబాద్ పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గం



**జహీరాబాద్ , ఆగస్టు 24 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణ పద్మశాలి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బండి వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

అధ్యక్షుడిగా బండి వెంకట్, ఉపాధ్యక్షులుగా సుదం శివసాయి, అంబాటి ప్రశాంత్, గాజుల రామకృష్ణ, బొంగుర్ రమేష్, చింతా కార్తీక్, గడ్డం రాజేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా నామాల సునీల్, నగారం పరమేశ్వర్, కోశాధికారిగా గద్దె నర్సింలు, సహాయ కోశాధికారిగా గాజుల విఠల్ ఎన్నికయ్యారు. సంఘ సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి పద్మశాలి సమాజ అభివృద్ధికి, యువతలో ఐక్యత, చైతన్యం పెంపునకు కృషి చేస్తామని అధ్యక్షుడు బండి వెంకట్ తెలిపారు. త్వరలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 24 ఏటూరు నాగారం** ఏటూరునాగారం కరాటే అకాడమిలో శిక్షణ పొందిన ఆరుగురు కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి ముగ్గురు గోల్డ్‌మెడల్ సాదించగా, మిగతా ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఏటూరునాగారం కరాటే కోచ్ హుస్సేన్ మాస్టార్ తెలిపారు.

ఎంతో క్రమశిక్షణతో నేర్చుకున్న కరాటేలో సాదించిన వారికి స్థానికులు అభినందనలు తెలిపారు. ఆదివారం హనుమకొండలోని అంతరాష్ట్రీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ 2026 పోటీలు జరిగాయి. ఈ కరాటే పోటీలకు 400 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఏటూరునాగారం కరాటే అకాడమికి చెందిన అలువాల సుమనశ్రీ బాలికల సీనియర్ విభాగంలో గ్రాండ్ ఛాంపియన్, గోల్డ్‌మెడల్‌ను గెలుచుకోగా రాష్ట్ర కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి చెలిమల్ల సాగర్ ట్రోఫీని అందజేశారు.

అలాగే గ్రాండ్ ఛాంపియన్, గోల్డ్‌మెడల్‌ను వసంత విశాల్ సాయి సాధించారని, వర్షిత్ సబ్ జూనియర్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు హుస్సేన్ తెలిపారు. అలాగే రాకేష్, గడ్డం వర్ష, తీనాశ్రీలు సిల్వర్ మెడల్స్‌ను సాధించారని వెల్లడించారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే

## బాధితులకు భరోసా కల్పించిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి, గోదావరిఖని, ఆగస్టు-24, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా హాజరై,వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ ప్రతి ఫిర్యాదును పరిశీలించి, బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిగణనలోకి తీసుకుని, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీపీ తెలిపారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని,ఎటువంటి ఆలస్యం లేకుండా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.




# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

## జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

**పెద్దపల్లి, ఆగస్టు-24, ప్రజాబలం ప్రతినిధి:** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో







కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, ఈ సెక్షన్ సూపర్డెంట్ విజయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంపు కొడుతున్న మేజర్ గ్రామపంచాయతీ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 23** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ ఏటూరునాగారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో వర్షాకాలం సమీపించిన వృధా నీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడ దోమలు పెరిగి విష జ్వరాలకు దారి తీస్తుంది ముఖ్యంగా ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ పేరుకు మాత్రం తప్ప పారిశుద్ధ్యంలో వెనుకబడిపోతుంది ఎక్కడ చూసినా మురికి నీటితో నిండిన కాలువలు నీటిపై దోమలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి వర్షాకాలం సీజన్ రాకముందే మురికి నీటి కాలువలు శుభ్రం చేయాలని ఆలోచన లేకపోవడంతో ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు విష జ్వరాలకు లోనవుతూ ఉన్నారు ఎక్కడ చూసినా ఇంటికొకరు చొప్పున విష జ్వరాలతో మంచం పట్టి రోగులుగా మారిపోయారు వర్షకాలం వచ్చిందంటే దోమలను నివారించేందుకు దోమ మందు పిచికారి చేసేవారు నీటి బురదలపై దోమ మందు చెల్లి దోమల నివార చర్యలు తీసుకోకపోవడంతో ఈరోజు దోమల వలన విష జ్వరాలు ఎక్కువైపోయింది సంబంధిత గ్రామ సర్పంచి గాని గ్రామ కార్యదర్శి గాని పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి దోమల నివారణకు చర్యలు తీసుకొని దోమల పిచికారి చేయాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు

# కొండా సురేఖ మాజీ ఓస్డీ కోసం గాలింపు

హైదరాబాద్ హత్యాయత్నం కేసులో మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ నార్ల సుమంత్ తో పాటు అతడి అనుచరుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గత నెల 30న జూబ్లీహిల్స్లో డబ్బు విషయమై మాట్లాడేందుకు పిలిపించి, రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై ఇనుపరాడ్తో దాడి చేసినట్లు కేసు నమోదైంది. పరారీలో ఉన్న సుమంత్ కోసం నాలుగు బృందాలు గాలిస్తుండగా, ఆయన డ్రైవర్ నవీన్ ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

## అచ్చే మొగిలి ఏ ఎల్ ఎం ను పరామర్శించిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 24 ఏటూరు నాగారం** శివాపురం, గోగుపల్లిలో ఏఎల్‌ఎం గా విధులు నిర్వహిస్తున్న అచ్చే మొగిలి రెండు నెలల క్రితం విద్యుత్ షాక్‌కు గురై ప్రమాదవశాత్తు కుడి చేతిని కోల్పోయారు. ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎలాంటి సహాయం అవసరమైనా తమ వంతు తోడ్పాటు అందిస్తామని భరోసా కల్పించారు. బిఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చేల వినయ్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, శివాపురం వార్డు నెంబర్ రాకేష్ రెడ్డి, మండల నాయకులు నీలం శ్రీనివాస్, సుంకరి సుధాకర్ రెడ్డి, కల్తీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపికబురు

అమరావతి ఏపీలో నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మొత్తంగా 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ 2026ను విడుదలచేసింది. నాలుగుదశల్లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. గ్రూప్-1లో 149పోస్టులు, గ్రూప్-2లో 673ఉద్యోగాలు, డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులతో పాటు పోలీస్, ఫైర్, జైళ్లు, అటవీ, పశుసంవర్ధక శాఖలు, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖలలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆర్థికశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది...




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com